మీరే చదువరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

మీరే విలేకరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

శనివారం SATURDAY 29-11-2025 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00
సంపుటి: 1 Volume:1 ‖ సంచిక: 150 Issue: 150

Published from Jagitial
www.evarthalu.com

29 నవంబర్ 2025 - శనివారం శ్రీ విశ్వావసు నామ సంవత్సరం దక్షిణాయనం - హేమంత ఋతువు మార్గశిర మాసం - శుక్లపక్షం సూర్యోదయం - ఉ. 6:32 సూర్యాస్తమయం - సా. 5:36 తిథిః నవమి రా. 11:09 వరకు తరువాత దశమి సంస్కృత వారం స్థిర వాసరః నక్షత్రం పూర్వాభాద్ర రా. 2:090 వరకు తరువాత ఉత్తరాభాద్ర యోగం హర్షణ ఉ. 9:19 వరకు కరణం భాలవ ఉ. 11:46 వరకు కౌలవ రా. 11:09 వరకు వర్జ్యం ఉ. 9:06 నుండి ఉ. 10:40 వరకు దుర్ముహూర్తం ఉ. 8:01 నుండి ఉ. 8:45 వరకు రాహుకాలం ఉ. 9:18 నుండి ఉ. 10:41 వరకు యమగండం మ. 1:27 నుండి మ. 2:50 వరకు గుళికాకాలం ఉ. 6:32 నుండి ఉ. 7:55 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:56 నుండి తె. 5:44 వరకు అమృత ఘడియలు సా. 6:30 నుండి రా. 8:04 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:42 నుండి మ. 12:26 వరకు గమనిక: "ం" అనగా మరుసటి రోజున



## అమ్మ చేతి.. వంట కమ్మన!

ఇంటి ఫుడ్డే బెటర్ అంటున్న భారతీయులు

**దేశంలో 73 శాతం మంది వంట ఇంట్లోనే.. తాజా పదార్థాలు, కుటుంబ విలువలే కారణం**

**బయటి ఆహారానికే అమెరికన్ల ఇంట్రెస్ట్.. అక్కడే ఇంట్లో వంట చేసేది 57 శాతం మందే**

అమ్మ వండిపెట్టే ఆహారమే ఒంటికి మంచిది అని మన పెద్దలు చెప్తుంటారు. దాన్ని అక్షరాలా నిజం చేస్తున్నామట. ప్రపంచం మొత్తంలో ఇంటి ఆహారానికి అధిక ప్రాధాన్యం ఇచ్చేవారిలో అత్యధికులు ఎవరు? అంటే భారతీయులే.. అని తాజా అధ్యయనంలో తేలింది. ప్రపంచవ్యాప్తంగా ప్రజల ఆహారపు అలవాట్లు, రోజూ ఇంట్లో వంట చేసుకునే పద్ధతులు, సాంస్కృతిక, ఆర్థిక, సామాజిక పరిస్థితులపై ప్రముఖ డేటా సంస్థ స్టాటిస్టా 2024లో నిర్వహించిన కన్జుమర్ ఇన్సైట్స్ సర్వేలో ఆసక్తికర విషయాలు వెల్లడయ్యాయి.

2

## నచ్చకపోతే.. నోటా

రెండో రోజు 4,901 నామినేషన్లు




### సర్పంచ్ ఎన్నికల్లో నోటా గుర్తు

**కలెక్టర్లకు ఎన్నికల సంఘం ఆదేశం.. బ్యాలెట్ చివర్లో ఉండాలని సూచన**

**మొత్తం 50 ఎన్నికల గుర్తులు విడుదల.. సర్పంచులకు 30, వార్డు సభ్యులకు 20**

పంచాయతీ ఎన్నికల్లో తొలిసారి నోటా గుర్తును కేటాయించబోతున్నట్లు ఎన్నికల సంఘం ప్రకటించింది. పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ఫ్రీ సింబల్స్‌ను ప్రకటించిన ఈసీ.. బ్యాలెట్ చివరి గుర్తుగా నోటా ఉండాలని ఆదేశించింది. ఈ మేరకు అన్ని జిల్లాల కలెక్టర్లకు నోటిఫికేషన్ జారీ చేసింది.

హైదరాబాద్, నవంబర్ 28 (ఈవార్తలు): సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల గుర్తులను విడుదల చేసింది. ఇందులో సర్పంచ్ అభ్యర్థుల కోసం 30 గుర్తులు, వార్డు సభ్యుల కోసం 20 గుర్తులు కేటాయించింది. స్థానిక సంస్థల ఎన్నికలు పార్టీల గుర్తుల మీద జరగవు. కాబట్టి ఎన్నికల సంఘం కొన్ని గుర్తులను (ఫ్రీ సింబల్స్) విడుదల చేస్తుంది. ఆయా పార్టీలు తమ తమ అభ్యర్థులను నిలబెట్టినప్పటికీ అది అనధికారికమే. ఏ పార్టీ గుర్తు ఉండదు. ఆయా పార్టీలు తమ తమ అభ్యర్థులను ఎంచుకుని తమ 'పార్టీ మద్దతు ఇచ్చిన అభ్యర్థి'గా ప్రచారం చేసుకుంటారు. ఈ నేపథ్యంలో ఏ పార్టీ గుర్తులు బ్యాలెట్ పత్రంపై కనిపించవు. ఇప్పటికే మొదటి తరువాయి 2 వ పేజీలో...



## ఏకగ్రీవానికి కోటిస్తా

**ఎకరం భూమి కూడా రాసిస్తా**

**సొంతంగా స్కాలర్‌షిప్‌లు ఇస్తా**

**ఖమ్మం జిల్లాలో ఓ అభ్యర్థి ఆఫర్**

నేలకొండపల్లి/ఖమ్మం జిల్లా, నవంబర్ 28 (ఈవార్తలు): పంచాయతీ ఏకగ్రీవానికి ఆఫర్స్ వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికే మొదటి విడత ఎన్నికలకు నామినేషన్లు నడుస్తున్నాయి. అయితే సర్పంచ్ పదవులపై కన్నేసిన ఆశావాహులు ఓటర్లకు ఆశ చూపుతున్నారు. పోటీ వద్దంటూ ఏకగ్రీవాల కోసం బేరసారాలు ఆడుతున్నారు. తాజాగా, ఖమ్మం జిల్లాలోని నేలకొండపల్లి మండలం ముటాపురం గ్రామానికి కిష్టారావు అనే అభ్యర్థి బంపర్ ఆఫర్ ఇచ్చాడు. తనను గ్రామానికి సర్పంచ్ గా ఏకగ్రీవం చేస్తే తరువాయి 2 వ పేజీలో...



## శ్రీరాముడు.. 77 అడుగులు!

**ప్రపంచంలోనే ఎత్తైన విగ్రహం.. ఆవిష్కరించిన ప్రధాని మోదీ**

పనాజీ: దక్షిణ గోవాలోని శ్రీ సంస్థాన్ గోకర్ణ జీవోత్తమ్ మఠంలో ఏర్పాటు చేసిన ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన 77 అడుగుల కాంస్య శ్రీరాముడి విగ్రహాన్ని ఆవిష్కరించారు. గుజరాత్‌లోని స్టాట్యూ ఆఫ్ యూనిటీ శిల్పి రామ్ సుతార్ ఈ రాముడి విగ్రహాన్ని తయారు చేశారు. 550 ఏళ్ల మఠం సంప్రదాయాన్ని పురస్కరించుకుని నవంబర్ 27వ తేదీ నుంచి డిసెంబర్ 7వ తేదీ వరకు ఇక్కడ వివిధ కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా మఠాన్ని సందర్శించిన మోదీ.. మఠం ప్రాంగణంలో ప్రతిష్ఠించిన 77 అడుగుల ఎత్తు కలిగిన శ్రీరాముడి కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ మఠం.. భారతదేశంలోని అత్యంత పురాతన మఠాల్లో ఒకటి. 370 సంవత్సరాల క్రితం పార్టగల్‌లో ఈ మఠాన్ని నిర్మించారు.

### బంగారం-వెండి ధరలు

| | |
|---|---|
| బంగారం (గ్రాము-24 క్యారెట్స్): | రూ.12,846 |
| వెండి (గ్రాము): | రూ.183 |
| ప్లాటినం (గ్రాము): | రూ.4,720 |




## వెళ్తున్నా.. జిల్లాలకు!

**జిల్లాల్లో సీఎం రేవంత్ పర్యటనలు**

**ప్రజాపాలన వారోత్సవాల షెడ్యూల్ రిలీజ్**

హైదరాబాద్, నవంబర్ 28 (ఈవార్తలు): ప్రజాపాలన వారోత్సవాల సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి జిల్లాల పర్యటన షెడ్యూల్ ఖరారైంది. ప్రతి జిల్లాలో ప్రజాసభలు, అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాలు, అధికారులతో సమీక్షలు నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. పర్యటన నేపథ్యంలో ఆయా ప్రాంతాల్లో కాంగ్రెస్ తరువాయి 2 వ పేజీలో...



## నేనొస్తున్నా.. ఇండియాకు!

**ఫుట్‌బాల్ స్టార్ మెస్సీ ట్వీట్**

**డిసెంబర్ 13న హైదరాబాద్‌కు రాక.. మేం వెయిటింగ్: సీఎం రేవంత్**

హైదరాబాద్, నవంబర్ 28 (ఈవార్తలు): ఫుట్‌బాల్ దిగ్గజం లియోనెల్ మెస్సీ హైదరాబాద్‌లో పర్యటించనున్నారు. తెలంగాణ బ్రాండ్ ప్రమోషన్‌లో భాగంగా తెలంగాణ రైజింగ్ కార్యక్రమానికి మెస్సీని గ్లోబల్ బ్రాండ్ అంబాసడర్‌గా ఆహ్వానించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి సిద్ధమవుతున్నారు. డిసెంబర్ 13 నుంచి 15 వరకు మెస్సీ కోల్‌కతా, ముంబై, ఢిల్లీ, హైదరాబాద్ లో పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలో ఆయన సోషల్ మీడియా వేదికగా భారతీయులకు దన్యవాదాలు తెలియజేశాడు. 'ఇండియా నుంచి లభిస్తున్న తరువాయి 2 వ పేజీలో...

### విశ్వవాణి



## యాపిల్ రికార్డు

స్మార్ట్ ఫోన్ రారాజుగా వెలుగొందుతున్న శాంసంగ్‌ను యాపిల్ తొలిసారి వెనక్కి నెట్టింది. 2010 నుంచి స్మార్ట్ ఫోన్ మార్కెట్‌లో నంబర్ వన్‌గా ఉంటూ, మార్కెట్‌లో 19.4 శాతం వాటాను కలిగిన శాంసంగ్ అమ్మకాలను ఈ ఏడాది యాపిల్ దాటేసింది. ఈ ఏడాది శాంసంగ్ అమ్మకాలు 4.6 శాతం జరగ్గా, యాపిల్ ఇప్పటికే 10 శాతం దాటేందుకు సిద్ధమైంది . ఈ టార్గెట్‌కు ఇంకో నెల మిగిలే ఉంది.

## 'కొత్త' జీవితం ప్రారంభిస్తాం



**జనవరి 1న జన జీవన స్రవంతిలో కలుస్తాం**

**అంతా కలిసి సాయుధ విరమణ చేస్తాం**

**అనంత్ పేరులో మావోయిస్టు పార్టీ ప్రకటన**

**పోలీసుల అదుపులోనే దేవ్‌జీ ఉన్నాడని వెల్లడి**

భద్రాద్రి కొత్తగూడెం, వైజాగ్, రాయ్‌పూర్, నవంబర్ 28 (ఈవార్తలు): ఆయుధ విరమణపై మావోయిస్టు పార్టీ కీలక ప్రకటన చేసింది. కొత్త సంవత్సరం సందర్భంగా జనవరి 1న సాయుధ విరమణ చేస్తామని వెల్లడించింది. అందరూ కలిసి ఒకేసారి లొంగిపోనున్నట్లు తెలిపింది. ఎంఎంసీ జోన్ ప్రతినిధి అనంత్ పేరుతో ప్రకటన విడుదలైంది. 'ఆయుధ విరమణ అంటే ప్రజలకు ద్రోహం చేయడం కాదు. సంఘర్షణకు సరైన సమయం కాదు. అధిక ప్రాధాన్యత ఇచ్చే సర్కార్‌తో వెళ్తాం' అని -2 వ పేజీలో...

## మాజీ నక్సలైట్ దారుణ హత్య

**రాజన్న సిరిసిల్లలో ఘటన**

సిరిసిల్ల, జగిత్యాల టౌన్, నవంబర్ 28 (ఈవార్తలు): రాజన్న సిరిసిల్ల జిల్లా అగ్రహారం గుట్టల్లో మాజీ నక్సలైట్ దారుణ హత్యకు గురయ్యాడు. గురువారం తంగళ్లపల్లి మండలం గండిలచ్చపేట గ్రామానికి చెందిన సిద్దయ్య అలియాస్ నర్సయ్య (50)ను జగిత్యాల జిల్లాకు చెందిన సంతోష్ బండరాళ్లతో మోది చంపేశాడు. రాత్రి కుటుంబసభ్యులకు సమాచారం అందివ్వగా హుటాహుటిన ఘటన స్థలానికి చేరున్నారు. జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే మహేశ్ బాబాసాహెబ్, పోలిసు అధికారులతో కలిసి ఘటన -2 వ పేజీలో...

## ఆర్థిక వృద్ధి.. 8.2%

**రెండో త్రైమాసికంలో పైపైకి**

**అంచనాలకు మించి రయ్.. రయ్**

**దూసుకెళ్లిన భారత ఆర్థిక వ్యవస్థ**



న్యూఢిల్లీ/ముంబై: భారత ఆర్థిక వ్యవస్థకు గుడ్ న్యూస్ అందింది. ప్రస్తుతం ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికానికి(జులై నుంచి సెప్టెంబర్) సంబంధించి దేశ జీడీపీ వృద్ధి రేటు గణాంకాలు శుక్రవారం సాయంత్రం విడుదలయ్యాయి. రెండో త్రైమాసికంలో భారత జీడీపీ వృద్ధి రేటు ఊహించిన దాని కంటే అధికంగా నమోదైంది. భారత ఆర్థిక వ్యవస్థ జులై నుంచి సెప్టెంబర్ త్రైమాసికంలో 8.2 శాతం వృద్ధి రేటుతో పెరిగింది. బలమైన వినియోగదారుల తరువాయి 2 వ పేజీలో...

# రాశి ఫలాలు
29.11.2025

మేషం: వ్యాపారాలు మందకొడిగా సాగుతాయి. ఉద్యోగస్తులకు ఇతరుల నుండి సమస్యలు తప్పవు. నూతన ఋణాలు చేస్తారు. వృధా ప్రయాణ సూచనలున్నవి. ఉద్యోగ ప్రయత్నాలు వాయిదా పడతాయి. దైవ చింతన పెరుగుతుంది. కుటుంబ సభ్యులతో మాట పట్టింపులుంటాయి.

వృషభం: ఉద్యోగస్తులకు ఉన్నత హోదాలు లభిస్తాయి. అన్ని రంగాల వారు నూతనోత్సాహంతో ముందుకు సాగుతారు. స్నేహితులతో సఖ్యత పెరుగుతుంది. విలువైన వస్తువాహనాలు కొనుగోలు చేస్తారు. చిన్ననాటి మిత్రులతో శుభకార్యాల్లో పాల్గొంటారు. వ్యాపారాలు మరింత ఉత్సాహంగా సాగుతాయి.

మిధునం: వ్యాపారాలు నిరాశాజనకంగా సాగుతాయి. చేపట్టిన పనులలో ఆటంకాలు ఉంటాయి. వృధా ఖర్చులు చేదాటుతాయి. ఉద్యోగ వాతావరణం కొంత చికాకు పరుస్తుంది. ఆరోగ్య విషయంలో అశ్రద్ధ చేయడం మంచిది కాదు. కుటుంబసభ్యులతో చిన్నపాటి వివాదాలు ఉంటాయి.

కర్కాటకం: ఆకస్మిక ధనలాభ సూచనలున్నవి. ఇంటా బయట నూతన పరిచయాలు పెరుగుతాయి. వృత్తి ఉద్యోగాలలో కొన్ని సంఘటనలు ఆకట్టుకుంటాయి. వ్యాపార విస్తరణ ప్రయత్నాలు ఫలిస్తాయి. కుటుంబ సభ్యులతో శుభకార్యాల్లో పాల్గొంటారు. స్నేహితులతో వివాదాలు పరిష్కార దిశగా సాగుతాయి.

సింహం: గృహమున కొన్ని సంఘటనలు ఆశ్చర్యం కలిగిస్తాయి. చేపట్టిన పనులలో అప్రయత్న కార్యసిద్ధి కలుగుతుంది. ఉద్యోగస్తులకు మరింత అనుకూల వాతావరణం ఉంటుంది. కుటుంబ సభ్యులతో శుభ కార్యాలలో పాల్గొంటారు. ప్రముఖులతో పరిచయాలు విస్తృతమౌతాయి.

కన్య: బంధువులతో వివాదాలకు దూరంగా ఉండటం మంచిది. సోదరులతో ఒక వ్యవహారంలో సఖ్యత లోపిస్తుంది. వ్యాపారాలు నత్తనడకన సాగుతాయి. ఉద్యోగులకు ఒత్తిడి పెరుగుతుంది. దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. చేపట్టిన పనులు మందకోడిగా సాగుతాయి. చిన్నపాటి ఆరోగ్య సమస్యలు బాధిస్తాయి.

తుల: ఉద్యోగస్తులకు నిరుత్సాహం తప్పదు. ఆకస్మిక ప్రయాణ సూచనలు ఉన్నవి. ముఖ్యమైన కార్యక్రమాలు నిరాశ కలిగిస్తాయి. పనులలో శ్రమ పెరుగుతుంది. వ్యాపారాలలో గందరగోళ పరిస్థితులు ఉంటాయి. ఆదాయానికి మించి ఖర్చులు ఉంటాయి. కుటుంబ సభ్యులతో ధార్మిక సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు.

వృశ్చికం: అందరిలోనూ గుర్తింపు పెరుగుతుంది. చిన్ననాటి మిత్రులతో సఖ్యత కలుగుతుంది. లాభాల బాటలో సాగుతాయి. స్థిరస్తి కొనుగోలు ప్రయత్నాలు ఫలిస్తాయి. పలుకుబడి కలిగిన వారితో పరిచయాలు పెరుగుతాయి. ఉద్యోగస్తులకు అధికారుల నుండి గుర్తింపు లభిస్తుంది.

ధనస్సు: ఉద్యోగస్తులకు అదనపు బాధ్యతలు ఉన్నపటికీ నిదానంగా పూర్తిచేస్తారు. సంతాన విద్యా ఉద్యోగ ప్రయత్నాలు సానుకూలమౌతాయి. వ్యాపారాలు ప్రోత్సాహకరంగా సాగుతాయి. అందరిలోనూ పేరుప్రతిష్ఠలు పెరుగుతాయి. కొత్త వ్యక్తులతో పరిచయాలు ఉత్సాహనిస్తాయి.

మకరం: ఉద్యోగస్తులకు స్థానచలన సూచనలున్నవి. ఆదాయం అంతంత మాత్రంగా ఉంటుంది. స్నేహితులతో విభేదాలు కొంత చికాకు పరుస్తాయి. వ్యాపారాలలో ఆటుపోట్లు తప్పవు. నిరుద్యోగ ప్రయత్నాలు మందగిస్తాయి. వృధా ఖర్చులు విషయంలో జాగ్రత్త అవసరం. చేపట్టిన పనులలో శ్రమ పెరుగుతుంది.

కుంభం: దేవాలయ దర్శనాలు చేసుకుంటారు. నూతన వాహనయోగం ఉన్నది. ఆకస్మిక ధనలాభ సూచనలున్నవి. సమాజంలో గౌరవ మర్యాదలకు లోటు ఉండదు. ఉద్యోగస్తులకు శుభవార్తలు అందుతాయి. చేపట్టిన పనులలో యత్న కార్యసిద్ధి కలుగుతుంది. శుభకార్యాలకు ఆహ్వానాలు అందుతాయి.

మీనం: సంతానం వివాహ ప్రయత్నాలు అనుకూలించవు. ముఖ్యమైన కార్యక్రమాలు ముందుకు సాగవు. ప్రయాణాలు వాయిదా పడతాయి. ఉద్యోగులకు ఊహించని మార్పులు తప్పవు. బంధువులతో విభేదాలు కొంత బాధిస్తాయి. కుటుంబ సభ్యుల నుండి ఒత్తిడులు పెరుగుతాయి. వ్యాపారాలు నిరుత్సాహపరుస్తాయి.



# అమ్మ చేతి..వంట కమ్మన!

న్యూఢిల్లీ: ఎనిమిది దేశాల్లో జరిపిన ఈ సర్వేలో, రోజూ ఇంట్లో వంట చేసుకునే వారిలో భారతీయులు అగ్రస్థానంలో నిలవగా, అమెరికన్లు చివరి స్థానంలో ఉన్నారు. ఈ సర్వే ప్రకారం, భారతదేశంలో కుటుంబానికి భోజనం సిద్ధం చేసే బాధ్యత ఉన్నవారిలో ఏకంగా 73 శాతం మంది ప్రతిరోజూ ఇంట్లోనే వంట చేస్తున్నట్లు తెలిపారు. భారతీయ వంట సంప్రదాయాలు, తాజా పదార్థాలతో వంట చేసుకోవాలనే తపన, కుటుంబ విలువలు ఇందుకు ప్రధాన కారణాలుగా నిలుస్తున్నాయి. ఇంటి భోజనం ఆరోగ్యకరమనే బలమైన నమ్మకం కూడా భారతీయులను ఈ విషయంలో ముందు నిలుపుతోంది. మరోవైపు, అమెరికా ఈ జాబితాలో అట్టడుగున నిలిచింది. ఇక్కడ కేవలం 57 శాతం మంది మాత్రమే రోజూ ఇంట్లో వంట చేస్తున్నారు. సర్వే చేసిన 8 దేశాల సగటు (63 శాతం) కంటే ఇది చాలా తక్కువ. అమెరికాలో బిజీ జీవనశైలి, ఫాస్ట్ ఫుడ్ చైన్‌ల విస్తృత లభ్యత, టేక్‌అవే, ఫ్రోజెన్ మీల్స్ వంటి సౌకర్యవంతమైన ప్రత్యామ్నాయాలు ప్రజలను ఇంటి వంటకు దూరం చేస్తున్నాయి. సమయం ఆదా చేసుకోవాలనే ఆలోచనతో ఎక్కువమంది బయటి ఆహారంపై ఆధారపడుతున్నారు. ఇక, ఫ్రాన్స్‌లో రోజూ ఇంట్లో వంట చేసేవారి సంఖ్య 62 శాతంగా ఉంది. ఇక్కడి ప్రజలు తాజా, స్థానిక ఉత్పత్తులతో వంట చేయడానికి ఇష్టపడతారు. అయితే, ప్రపంచీకరణ, పట్టణీకరణ, ఫుడ్ డెలివరీ యాప్‌ల పెరుగుదల వంటి కారణాలతో యూరప్, ఆసియా దేశాల్లోనూ క్రమంగా మార్పులు చోటుచేసుకుంటున్నాయి.

# ఆర్థిక వృద్ధి.. 8.2%

మొదటి పేజీ తరువాయి

వ్యయం (కన్స్యూమర్ స్పెండింగ్), పటిష్టమైన తయారీ రంగం (మ్యానుఫ్యాక్చరింగ్ సెక్టార్) కారణంగా వృద్ధి రేటులో ఈ పెరుగుదల నమోదైంది. ప్రపంచ వాణిజ్యంలో అధిక అనిశ్చితి ఉన్నప్పటికీ భారత్ ఈ జీడీపీ వృద్ధిని సాధించింది. దీనికి ముందు త్రైమాసికంలో దేశ జీడీపీ వృద్ధి రేటు 7.8 శాతంగా ఉంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో నామినల్ జీడీపీ వృద్ధి రేటు 8.7 శాతంగా ఉంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి అర్ధభాగంలో (ఏప్రిల్ నుండి సెప్టెంబర్ వరకు) రియల్ జీడీపీ వృద్ధి రేటు 8 శాతంగా ఉంది. గత ఆర్థిక సంవత్సరం మొదటి అర్ధభాగంలో ఇది 6.1 శాతంగా ఉంది. ఆర్థిక వ్యవస్థ వృద్ధి రేటుకు తయారీ రంగం, సేవా రంగంలోని బలమైన వృద్ధి నాయకత్వం వహించిందని కేంద్రం తెలిపింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో రియల్ జీవీఏ వృద్ధి 8.1 శాతంగా నమోదైంది. ఫైనాన్షియల్, రియల్ ఎస్టేట్, ప్రొఫెషనల్ సర్వీసెస్ విభాగంలో రెండంకెల జీవీఏ వృద్ధి రేటు నమోదైంది. వ్యవసాయం, సంబంధిత రంగాలలో మాత్రం కొద్దిగా నెమ్మదైన వృద్ధి నమోదైంది.



### రంగాల వారీగా వృద్ధి రేటు

తయారీ రంగం - 9.1 శాతం
నిర్మాణ రంగం -7.2 శాతం
ఫైనాన్షియల్, రియల్ ఎస్టేట్, ప్రొఫెషనల్ సర్వీసులు- 10.2 శాతం
వ్యవసాయం, సంబంధిత రంగాలు - 3.5 శాతం
విద్యుత్, గ్యాస్, నీటి సరఫరా, ఇతర యుటిలిటీసర్వీసులు- 4.4 శాతం




# నచ్చకపోతే..నోటా

మొదటి పేజీ తరువాయి

విడత నామినేషన్ ప్రక్రియ ప్రారంభమైంది. మొదటి విడత జరిగే గ్రామ పంచాయతీల్లో వార్డు, సర్పంచ్ ఎన్నికల కోసం నోటిఫికేషన్ జారీ అయింది. అభ్యర్థుల నుంచి నామినేషన్‌లను స్వీకరిస్తున్నారు. గ్రామాల్లో ప్రధాన పార్టీలు తమ పార్టీల తరఫున అభ్యర్థులను నిలబెడుతున్నాయి. పెద్ద ఎత్తున స్వతంత్రులు బరిలో నిలిచేందుకు ఆసక్తి చూపిస్తున్నారు.

### రెండో రోజు 4,901 నామినేషన్లు

పంచాయతీ ఎన్నికల నామినేషన్ల పర్వంలో రెండో రోజైన శుక్రవారం సర్పంచి పోటీకి 4,901 నామినేషన్లు దాఖలయ్యాయి. రెండు రోజులకు కలిపి సర్పంచి స్థానాల కోసం 8,198 నామినేషన్లు రాగా, వార్డు సభ్యులకు 11,502 నామినేషన్లు వచ్చాయి. తొలి విడత నామినేషన్లకు శనివారంతో గడువు ముగియనుండగా.. భారీ స్థాయిలో నామినేషన్లు వస్తాయని అధికారులు అంచనా వేస్తున్నారు. మొదటి విడతలో 4,236 సర్పంచి, 37,440 వార్డులకు ఎన్నికలు జరగనున్నాయి.

# ఏకగ్రీవానికి కోటిస్తా

మొదటి పేజీ తరువాయి

కోటి రూపాయలతో అభివృద్ధి పనులు చేస్తానని ప్రకటించాడు. అంతేగాకుండా ఊర్లోని వీరన్న సామి గుడికి ఎకరం భూమిని విరాళం ఇస్తానని..అంతేగాకుండా పలు సంక్షేమ కార్యక్రమాలు చేస్తానని అన్నాడు.. విద్యార్థులకు సొంతగా స్కాలర్ షిప్ ఇస్తానని చెప్పాడు. ఈ వీడియో ఇపుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. అయితే గ్రామస్థులు మాత్రం కిష్టారావు నాన్ లోకల్ అని అంటున్నారు. సోషల్ మీడియాలో ప్రచారం కోసమే ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నాడని పేర్కొంటున్నారు.





# మాజీ నక్సలైట్ దారుణ హత్య

మొదటి పేజీ తరువాయి

స్థలాన్ని పరిశీలించారు. అనంతరం వేములవాడ ప్రభుత్వ దవాఖానాలోని మార్చురీలోని సిద్దన్న మృతదేహాన్ని పరిశీలించి కుటుంబసభ్యులతో మాట్లాడారు. సిద్దన్నను సంతోష్ ఒక్కడే హత్య చేయలేదని, మరికొంత మంది హస్తం ఉందని అనుమానాలు వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సిద్దన్నకు ఇద్దరు భార్యలు పోశవ్వ, ఎల్లవ్వ ఉన్నారు. మొదటి భార్యకు కొడుకు అశోక్, రెండో భార్యకు కొడుకు నరేశ్, కూతురు ఉన్నారు.

### తండ్రిని చంపిన పగతోనే..

మూడేళ్ల క్రితం ఓ యూట్యూబ్ చానల్లో బల్లెపు సిద్దన్న, మరో ఇద్దరు మాజీ మావోయిస్టులతో కలిసి ఇంటర్వ్యూ ఇచ్చాడు. ఆ ఇంటర్వ్యూలో తాము మావోయిస్టుగా ఉన్న సమయంలో ఫలానా వారిని చంపామని చెప్పాడు. అందులో సంతోష్ తండ్రి కూడా ఉన్నట్లు తెలిసింది. యూట్యూబ్‌లో సిద్ధన్న ఇంటర్వ్యూ చూసిన సంతోష్.. తన తండ్రిని చంపినందుకు పగ తీర్చుకోవాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం. ఎలాగైనా సిద్ధన్నను మట్టుబెట్టాలని నిర్ణయించుకొని, తన ప్రణాళికలో భాగంగా 3 నెలలుగా సిద్ధన్నతో స్నేహం పెంచుకున్నాడు. యూట్యూబ్ ఇంటర్వ్యూ చేస్తామని గురువారం మధ్యాహ్నం సిద్దన్నను అగ్రహారం గుట్టల వద్దకు రప్పించాడు. అక్కడ ఆయనకు మద్యం తాగించి బండరాయితో మోది, గొంతుకోసి చంపేశాడు. నిందితుడు జగిత్యాలలో పోలీసులకు లొంగిపోయాడు.



# నేనొస్తున్నా ఇండియాకు!

మొదటి పేజీ తరువాయి

ప్రేమకు నేను ముగ్ధుడినైపోయాను. గోట్ టూర్ త్వరలోనే ఆరంభం కానుంది. మొదట కోల్‌కతా, ముంబై, ఢిల్లీ మాత్రమే ప్లాన్ చేసినా ఇప్పుడు హైదరాబాద్ కూడా జాబితాలో చేరింది. త్వరలోనే ఇండియాకు వస్తున్నా' అని సోషల్ మీడియాలో మెస్సీ ప్రకటించాడు. మెస్సీ పర్యటనపై సీఎం రేవంత్ రెడ్డి స్పందించారు. 'ఫుట్‌బాల్ దిగ్గజం లియోనెల్ మెస్సీ డిసెంబరు 13న హైదరాబాద్‌కు రాబోతున్నారు. ఆయనకు స్వాగతం చెప్పేందుకు, ఆతిథ్యం ఇవ్వడానికి ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నా' అని పోస్టు చేశారు. 'మెస్సీ వంటి మహానుభావుడిని ఒకసారి కనీసం ప్రత్యక్షంగా చూడాలని ఫుట్‌బాల్ అభిమానులు ఎంతగానో ఆశపడతారు. అలాంటి దిగ్గజం మన నగరానికి రాబోతుండటం గర్వకారణం. హైదరాబాద్ తన ప్రత్యేక ఆతిథ్యంతో ఆయనను ఆహ్వానిస్తుంది. ఇక్కడి ప్రజల ఆదరణ ఏం అన్నది మెస్సీకి కచ్చితంగా తెలుస్తుంది' అని తెలిపారు. ఇండియా టూర్‌లో భాగంగా మెస్సీ పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు. ప్రత్యేక ఎగ్జిబిషన్ మ్యాచ్‌లు ఆడటం, ఫుట్‌బాల్ క్లినిక్స్ ప్రారంభోత్సవం, మ్యూజిక్ కన్సర్ట్, సన్మాన కార్యక్రమాలు ఉండనున్నాయి. మెస్సీ పర్యటన తెలంగాణలో క్రీడలు, యువత, అంతర్జాతీయ పెట్టుబడుల ప్రమోషన్‌కు మద్దతు లభిస్తుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# వెళ్తున్నా.. జిల్లాలకు!

మొదటి పేజీ తరువాయి

నాయకులు, కార్యకర్తలు సభా ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ప్రజాసభలు విజయవంతం కావాలన్న ఉద్దేశంతో వేదికలు, రవాణా, భద్రతా ఏర్పాట్లను పరిశీలిస్తున్నట్లు సమాచారం. ప్రజాపాలనలో రెండేళ్ల సాధనను ప్రజలకు వివరించడానికి, భవిష్యత్ అభివృద్ధి ప్రణాళికలను తెలియజేయడానికి ఈ సభలు ఉపయోగపడనున్నాయని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.



### సీఎం రేవంత్ పర్యటన ఇలా..

డిసెంబర్ 1న మహబూబ్ నగర్ జిల్లా మక్తల్
డిసెంబర్ 2న ఖమ్మం జిల్లా కొత్తగూడెం
డిసెంబర్ 3న కరీంనగర్ జిల్లా హుస్నాబాద్
డిసెంబర్ 4న ఆదిలాబాద్
డిసెంబర్ 5న నర్సంపేట
డిసెంబర్ 6న నల్లగొండ జిల్లా దేవరకొండ

# 'కొత్త' జీవితం ప్రారంభిస్తాం

మొదటి పేజీ తరువాయి

పేర్కొన్నారు. తాము ఆయుధాలు వీడేందుకు సిద్ధంగా ఉన్నామని మావోయిస్టులు ఇటీవల లేఖ విడుదల చేసిన సంగతి తెలిసిందే. మూడు రాష్ట్రాల ముఖ్యమంత్రులకు లేఖ రాశారు. ఆపరేషన్ కగార్‌లో భాగంగా మూడు రాష్ట్రాల్లో కూంబింగ్ ఆపరేషన్ నిలిపివేస్తే ఆయుధ విరమణ తేదీని ప్రకటిస్తామని పేర్కొనగా, తాజాగా తేదీని ప్రకటిస్తూ మావోయిస్టులు లేఖ విడుదల చేశారు. మరోవైపు, మావోయిస్టు పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, ప్రస్తుతం పార్టీకి చీఫ్‌గా కొనసాగుతున్నాడని పేర్కొంటున్న తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ పోలీసుల అదుపులో ఉన్నాడని మావోయిస్టు పార్టీ ప్రకటించింది. ఈ మేరకు దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ అధికార ప్రతినిధి వికల్ప్ పేరుతో ఈనెల 22న విడుదల అయిన లేఖ గురువారం వెలుగులోకి వచ్చింది. 'మావోయిస్టు పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు దేవ్‌జీతో పాటు మరో 50 మందిని పోలీసులు వేర్వేరు ప్రాంతాల్లో అదుపులోకి తీసుకున్నారు. వారిని వెంటనే కోర్టులో హాజరు పరచాలి. అదేవిధంగా మారేడుమిల్లి, రంపచోడవరం ఎన్‌కౌంటర్లకు నిరసనగా ఈనెల 30న భారత్‌బంద్ పాటించాలి. అటవీ ప్రాంతంలోని సహజ వనరులను కార్పొరేట్ శక్తులకు దోచిపెట్టేందుకే అక్కడి ఆదివాసీలపై ప్రభుత్వం దౌర్జన్య చర్యలకు దిగుతోంది. గిరిజన చట్టాలు అమలయ్యే రిజర్వ్ ఫారెస్ట్‌లో క్యాంపుల ఏర్పాటు, రోడ్లు, వంతెనల నిర్మాణం కోసం లక్షలాదిగా చెట్లను ప్రభుత్వం నరికివేస్తోంది' అని పేర్కొంది.

### ఛత్తీస్‌గఢ్‌లో 10 మంది లొంగుబాటు

ఛత్తీస్‌గఢ్‌లో మరో కీలక మావోయిస్టు నేత లొంగిపోయారు. దండకారణ్య స్పెషల్ జోన్ కమిటీ సభ్యుడు చైతూ అలియాస్ శ్యామ్ దాదా సహా పది మంది మావోయిస్టులు భద్రతాదళాల ఎదుట శుక్రవారం లొంగిపోయారు. శ్యామ్ దాదాపై రూ.25 లక్షల రివార్డు ఉంది. కాంగ్రెస్ రాష్ట్ర నాయకత్వాన్ని తుడిచిపెట్టేసేందుకు 2013లో జరిగిన దాడిలో శ్యామ్ దాదా మాస్టర్‌మైండ్ అని అధికారదస్త్రాలు చెబుతున్నాయి. సీపీఐ (మావోయిస్టు) దర్భా డివిజన్‌కు కొన్నేళ్ల పాటు శ్యామ్ దాదా నేతృత్వం వహించారు. ఛత్తీస్‌గఢ్-తెలంగాణ సరిహద్దుల్లోని మోస్ట్ వాంటెడ్ మావోయిస్టుల్లో శ్యామ్ ఒకరని పోలీసులు తెలిపారు. శ్యామ్ దాదాతో పాటు డివిజనల్ కమిటీ మెంబర్



సరోజ్ అలియాస్ ఊర్మిళ (రూ.8 లక్షల రివార్డు), ఏరియా కమిటీ మెంబర్లు భూపేష్ అలియాస్ సహాయక్ రామ్, ప్రకాశ్, కమలేష్ అలియాస్ ఝిత్రూ, జనని అలియాస్ రైమతి కశ్యప్, సంతోష్ అలియాస్ సన్నూ, నవీన్, పార్టీ మెంబర్లు రామ్‌షీలా, జయంతి కశ్యప్‌లు భద్రతా దళాల ముందు లొంగిపోయారు. వీరిపై మొత్తం రూ.65 లక్షల రివార్డు ఉందని పోలీసులు తెలిపారు. సుఖ్మాలో సీనియర్ పోలీసులు, జిల్లా అధికారుల ముందు వారు ఆయుధాలను త్యజించారని చెప్పారు. డీఆర్‌జీ, బస్తర్ ఫైటర్స్, సీఆర్‌పీఎఫ్, ఇతర భద్రతా దళాల ఆధ్వర్యంలో భారీ స్థాయిలో జరుగుతున్న నక్సల్స్ ఏరివేత చర్యలు, పలువురు సీనియర్ మావోయిస్టు నేతల లొంగుబాటు, ప్రభుత్వం పదే పదే చేస్తున్న సూచనలు ఈ పది మంది లొంగుబాటుకు దారితీశాయని పోలీసులు తెలిపారు.




# సెమీస్‌కు శ్రీకాంత్

**తన్వి, ఉన్నతి కూడా**

లక్నోలో జరుగుతున్న సయ్యద్ మోడీ ఇంటర్నేషనల్ బ్యాడ్మింటన్ టోర్నీలో భారత స్టార్ షట్లర్, తెలుగు కుర్రాడు కిదాంబి శ్రీకాంత్ సెమీస్‌కు దూసుకెళ్లాడు. శుక్రవారం జరిగిన క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో శ్రీకాంత్ ప్రత్యర్థి మరో భారత ప్లేయర్ ప్రియాన్ష్ రజావత్ రిటైర్డ్ అవడంతో అతను తర్వాతి రౌండ్‌కు చేరుకున్నాడు. రజావత్ వైదొలగకముందు తొలి గేమును శ్రీకాంత్ 21-14తో గెలిచాడు. రెండో గేములోనూ 11-4తో ఆధిక్యంలో నిలిచాడు. రెండో గేము మధ్యలో రజావత్ గాయపడి తప్పుకోవడంతో శ్రీకాంత్ నేరుగా సెమీస్‌కు చేరుకున్నాడు. మరో భారత యువ షట్లర్ మంజునాథ్ కూడా ముందడుగు వేశాడు. క్వార్టర్స్‌లో సహచరుడు మాన్‌రాజ్ సింగ్‌పై 21-18, 21-13 తేడాతో విజయం సాధించాడు. సెమీస్‌లో శ్రీకాంత్, మంజునాథ్ తలపడనున్నారు. ఉమెన్స్ సింగిల్స్‌లో 16 ఏళ్ల యువ సంచలనం తన్వి శర్మ కూడా సెమీస్‌లో అడుగుపెట్టింది. క్వార్టర్ ఫైనల్‌లో ఆమె 21-13 21-19 తేడాతో హాంకాంగ్‌కు చెందిన సిన్ యాన్ హ్యాపీ లోను మట్టికరిపించింది. 38 నిమిషాలపాటు సాగిన మ్యాచ్‌లో స్పష్టమైన ఆధిపత్యం ప్రదర్శించిన తన్వి వరుసగా రెండు గేముల్లోనూ విజయం సాధించింది. మరో యువ క్రీడాకారిణి ఉన్నతి హుడా 21-15, 13-21, 21-16 తేడాతో సహచర క్రీడాకారిణి రక్షితశ్రీపై గెలిచి సెమీస్‌కు చేరుకుంది. మరోవైపు, మహిళల డబుల్స్ విభాగంలో గాయత్రి గోపిచంద్-ట్రీసా జాలీ జోడీ టైటిల్ దిశగా సాగుతోంది. క్వార్టర్స్‌లో 21-15, 21-16 తేడాతో తుర్కియే బెంగిసు ఎర్సెటిన్-నజ్లికన్ ఇన్సి జంటప విజయం సాధించింది. 42 నిమిషాలపాటు సాగిన మ్యాచ్‌లో ప్రత్యర్థుల నుంచి గాయత్రి జంటకు పోటీ ఎదురైంది. కానీ, ఏ మాత్రం పట్టుదల కోల్పోయిన భారత షట్లర్లు రెండు గేముల్లోనూ పైచేయి సాధించారు.



# కాళోజీ వర్సిటీ వీసీ రాజీనామా

వరంగల్, నవంబర్ 28 (ఈవార్తలు): కాళోజీ నారాయణ రావు హెల్త్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ నందకుమార్ రాజీనామా చేశారు. పేపర్ల మూల్యాంకనంలో అవకవతకలతో పాటు ఇన్‌చార్జీల నియామకంలో ఆరోపణలు రావడంతో శు



క్రవారం సాయంత్రం రాజీనామా చేశారు. కాగా, కాసేపటి క్రితమే కాళోజీ వర్సిటీ వ్యవహారాలపై పత్రికల్లో వస్తున్న కథనాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించారు. అవకతవకలపై ఆరా తీశారు. ఈ అంశంపై వైద్యారోగ్య శాఖ ఉన్నతాధికారుల నుంచి సీఎం రేవంత్ రెడ్డి వివరణ కోరారు. ఉన్నతమైన వర్సిటీలో అస్తవ్యస్థ పరిస్థితులకు కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వానికి చెడ్డ పేరు తెచ్చే ఘటనల వెనుక ఎంతటి వారున్నా ఉపేక్షించే సమస్యే లేదని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ క్రమంలో అనూహ్యంగా వీసీ నందకుమార్ రాజీనామా చేయడం చర్చనీయాంశంగా మారింది.



# వణుకుతున్న గ్రామాలు

హైదరాబాద్, నవంబర్ 28 (ఈవార్తలు): చలిపులితో గ్రామాలు వణికి పోతున్నాయి. దీనికి తోడు తెల్లవారుజాము నుంచి పొగ మంచు కమ్మేయడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. పొగ మంచు వల్ల మార్నింగ్ వాకర్స్ కు కూడా ఇబ్బందిగా మారింది. సెల్ ఫోన్ లైట్ ద్వారా మార్నింగ్ వాకింగ్ చేస్తున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి. పొగ మంచుతోపాటు చలి విపరీతంగా పెరగడంతో గ్రామాల్లో వృద్ధులు, పిల్లలు చలితో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. చలి మంటలు కాపు కొని ఉపశమనం పొందుతున్నారు. రెండు, మూడు రోజుల నుంచి చలి తీవ్రత ఎక్కువ కావడంతో సాయంత్రం వేళలో వీధులన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. శుక్రవారం ఏర్పడిన పొగ మంచు వలన వాహనాదారులు. రైతులు ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు.

# టీమిండియా శుభారంభం

**ప్రపంచకప్‌లో చిలీపై ఘన విజయం**

జూనియర్ హాకీ ప్రపంచకప్ 2025లో భారత జట్టు తన ప్రస్థానాన్ని అద్భుతంగా ప్రారంభించింది. చెన్నై వేదికగా చిలీతో జరిగిన మొదటి మ్యాచ్‌లో 7-0 తేడాతో భారీ విజయాన్ని నమోదు చేసి, గోల్స్ తేడాలో స్విట్జర్లాండ్‌ను అధిగమించి 'పూల్ బి'లో అగ్రస్థానంలో నిలిచింది. చెన్నైలోని మేయర్ రాధాకృష్ణన్ హాకీ స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్‌లో భారత్ చిలీపై అద్భుతమైన విజయాన్ని నమోదు చేసింది. మ్యాచ్ ప్రారంభం 18 నిమిషాలు ఆలస్యమైంది. సుమారు 40 నిమిషాలపాటు జరిగిన ప్రారంభ వేడుకల్లో సంగీతం, నృత్యం, యుద్ధకళలు, లేజర్ షో అలరించాయి. ఆలస్యం అయినప్పటికీ భారత్ తొలి 15 నిమిషాల్లోనే దూకుడు ప్రదర్శించింది. చిలీ పటిష్టమైన డిఫెన్స్‌ను ఛేదించడానికి అనేకసార్లు ప్రత్యర్థి సర్కిల్‌లోకి దూసుకువెళ్లింది. చిలీ ఆటగాళ్లు తమ డిఫెన్స్‌ను పటిష్టంగా ఉంచి భారత అటాకర్లకు మార్గాలను అడ్డుకున్నారు. భారత ఆటగాళ్లు అమీర్ అలీ, తలేం ప్రియోబర్త వంటి వారి ద్వారా వెనుక నుంచి గాలిలో దీర్ఘ-శ్రేణి బంతులను పంపే వ్యూహాన్ని అనుసరించినప్పటికీ, చిలీ డిఫెండర్లు మార్గాలను అడ్డుకోవడంతో అవి పెద్దగా ఫలితం ఇవ్వలేదు. తొలి క్వార్టర్ చివరి నిమిషాల్లో భారత్‌కు పెనాల్టీ కార్నర్ లభించినా, చిలీ రషర్ దానిని సమర్థవంతంగా అడ్డుకోవడంతో తొలి క్వార్టర్ గోల్ రహితంగా ముగిసింది. రెండో క్వార్టర్ ప్రారంభమైన వెంటనే గోల్స్ వర్షం మొదలైంది. 16వ నిమిషంలో రోషన్ కుజూర్ తొలి గోల్ చేసి ఆధిక్యాన్ని సాధించాడు. అమీర్ దాడి చిలీ డిఫెండర్‌పై ఒత్తిడి తెచ్చింది. దీంతో బంతి రోషన్‌కు చేరగా, అతను చాకచక్యంగా గోల్‌కీపర్ నికోలస్ ట్రోన్‌కోసో కాళ్ల మధ్య నుంచి బంతిని నెట్టి గోల్ చేశాడు. కేవలం 5 నిమిషాల తర్వాత ఒడిశాకు చెందిన మిడ్‌ఫీల్డర్ '%ణ%' అంచున బంతిని అందుకున్నాడు. ముగ్గురు చిలీ ఆటగాళ్లను తప్పించుకొని, గోల్‌కీపర్‌ను దాటి అద్భుతమైన రెండో గోల్ చేసి ఆధిక్యాన్ని రెట్టింపు చేశాడు. శార్దానంద్ తివారీ డ్రాగ్-ఫ్లిక్‌ను గోల్‌కీపర్ అడ్డుకోవడంతో వచ్చిన రీబౌండ్‌ను సద్వినియోగం చేసుకొని దిల్ రాజ్ సింగ్ మూడో గోల్ సాధించాడు. దీంతో సగం సమయానికి భారత్ 3-0 ఆధిక్యంలో నిలిచింది. కోచ్ పి.ఆర్.శ్రీజేష్ స్టాండ్స్ నుంచి మ్యాచ్‌ను గమనించి జట్టుకు మార్గదర్శనం చేశారు. ఆయన మార్గదర్శకత్వం రెండో సగంలో వెంటనే ఫలించింది. తిరిగి ప్రారంభమైన మూడు నిమిషాల తర్వాత, దిల్ రాజ్ తన రెండో గోల్‌ను నమోదు చేసి భారత్ ఆధిక్యాన్ని మరింత పెంచాడు. ఒక నిమిషం తర్వాత జట్టులో యువ ఆటగాడు 17 ఏళ్ల అజీత్ యాదవ్ ఐదో గోల్ సాధించాడు. చివరి క్వార్టర్‌లో భారత్ ఒత్తిడిని కొనసాగించింది. ప్రారంభంలోనే షార్ట్ కార్నర్ లభించగా, అన్‌మోల్ ఎక్కా శక్తివంతమైన డ్రాగ్-ఫ్లిక్‌తో ఆరో గోల్‌ను నమోదు చేశాడు. చివరి నిమిషంలో కెప్టెన్ రోహిత్ పెనాల్టీ స్ట్రోక్‌ను గోల్‌గా మలిచి 7-0 విజయాన్ని ఖరారు చేశాడు. రెండు జట్ల మధ్య నాణ్యతలో స్పష్టమైన వ్యత్యాసం కనిపించింది. లాటిన్ అమెరికన్ జట్టు తొలి క్వార్టర్ తర్వాత అలసిపోయినట్లు కనిపించింది. నలుగురు చిలీ ఆటగాళ్లు తమ మొదటి జాతీయ మ్యాచ్ ఆడగా.. గుర్‌జ్యోత్ సింగ్, అమీర్ వంటి భారత ఆటగాళ్లు సీనియర్ జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహించారు. భారత్ 38 సార్లు ప్రత్యర్థి సర్కిల్‌లోకి దూసుకువెళ్లినా.. కేవలం ఆరు పెనాల్టీ కార్నర్లను మాత్రమే సాధించగలిగింది. ఈ అంశాన్ని కోచ్ శ్రీజేష్, అతని డిప్యూటీ బీరేంద్ర లక్రా దృష్టి సారించాలి. ప్రస్తుతం భారత్ పూల్ బిలో అగ్రస్థానంలో నిలవగా, ఒమన్, చిలీ వెనుకబడి ఉన్నాయి.

# రిజర్వేషన్లలో బీసీలకు అన్యాయం

**42 శాతం ఇచ్చాకే ఎన్నికలు పెట్టాలి**

**బీసీ కమిషన్ చైర్మన్ జీ నిరంజన్**

హైదరాబాద్, నవంబర్ 28 (ఈవార్తలు): తెలంగాణలో గ్రామ పంచాయతీ ఎన్నికలను రద్దు చేయాలనే బీసీలు డిమాండ్ చేస్తున్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల హామీని అమలు చేసిన తర్వాతే ఎన్నికలు జరపాలని బీసీ కమిషన్ ఛైర్మన్ జి. నిరంజన్ ప్రభుత్వానికి సూచించారు. 2019 పంచాయతీ ఎన్నికల్లో బీసీలకు 22.78% రిజర్వేషన్లు లభించాయని, ఈసారి మాత్రం బీసీలకు తక్కువ రిజర్వేషన్లు కల్పించారని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిరంజన్ విమర్శించారు. రాష్ట్ర జనాభాలో బీసీల సంఖ్య 56.33% అని కులగణన సర్వేలో తేలిన తర్వాత కూడా 2019 ఎన్నికల కంటే తక్కువ రిజర్వేషన్లు కల్పించడం తమను ఆశ్చర్యానికి గురి చేసిందని బీసీ కమిషన్ ఛైర్మన్ అన్నారు. రిజర్వేషన్లను నిర్ధారించే ప్రక్రియలో జరిగిన పొరపాట్ల వల్లనే బీసీ రిజర్వేషన్లు గతంలో కంటే ఈసారి తగ్గాయని ఆయన వెల్లడించారు. అందుకని పంచాయతీ ఎన్నికలను నిలిపివేసి, ఒక ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేసి, రిజర్వేషన్లలో జరిగిన తప్పులను సవరించాలని నిరంజన్ డిమాండ్ చేశారు.




# వారసత్వ భూమికి లంచం.. పట్టుబడ్డ ఎమ్మార్వో

మహబూబాబాద్, నవంబర్ 28 (ఈవార్తలు): భూ భారతి రికార్డుల్లో పేరును నమోదు చేయడానికి లంచం తీసుకుంటూ తహసీల్దార్ ఏసీబీకి పట్టుబడ్డాడు. వివరాల్లోకి వెళ్తే..మహబూబాబాద్ జిల్లా పెద్ద వంగర మండలం పోచంపల్లి గ్రామ శివారులోని పడమటి తండా గ్రామపంచాయతీకి చెందిన భూక్యా బాలు అనే రైతు తన తండ్రి మరణించారు. భూక్యా స్వామి మృతి చెందడంతో తండ్రిపేరు మీద ఉన్న భూమిని తన పేరు మీద భూ భారతి రికార్డుల్లో నమోదు చేయించుకోవడానికి తహసీల్దార్ వీరగంటి మహేందర్‌ను కలిశాడు. రూ.25వేల లంచంను డిమాండ్ చేశారు. దీంతో చేసేది లేక బాధితుడు ఏసీబీని ఆశ్రయించాడు. వారి సూచనల మేరకు శుక్రవారం 15 వేల రూపాయలు ఇస్తూ శుక్రవారం ఏసీబీకి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు.

# రైజింగ్ కోసం భారీ ఏర్పాట్లు

**3 వేల ప్రముఖులకు ఆహ్వానం**



హైదరాబాద్, నవంబర్ 28 (ఈవార్తలు): తరలిరండి- ఉజ్వల తెలంగాణలో పాలుపంచుకోండి అనే నినాదంతో ప్రభుత్వం.. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌ను నిర్వహిస్తోంది. డిసెంబర్ 8, 9 తేదీల్లో హైదరాబాద్‌భారత్ ఫ్యూచర్ సిటీలో తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ నిర్వహించేందుకు భారీ ఎత్తున ఏర్పాట్లు చేస్తోంది. హైదరాబాద్ చరిత్రలోనే అత్యంత ప్రతిష్టాత్మకంగా ఈ అంతర్జాతీయ సదస్సు నిర్వహించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయించారు. దేశ విదేశాలకు చెందిన దాదాపు 3 వేల మంది ప్రముఖులను ప్రభుత్వం ఈ సదస్సుకు ఆహ్వానిస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా పేరొందిన ప్రముఖులు, పారిశ్రామికవేత్తలు, టెక్నాలజీరంగ ప్రముఖులు ఈ జాబితాలో ఉన్నారు. బ్రిటన్ మాజీ ప్రధాని టోనీ బ్లేర్, ట్రంప్ మీడియా అండ్ టెక్నాలజీ గ్రూప్ డైరెక్టర్ ఎరిక్ స్విడర్, పారిశ్రామిక దిగ్గజం ఆనంద్ మహీంద్రా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ రాయల్ ఫ్యామిలీ సభ్యులు, వివిధ కంపెనీల అంతర్జాతీయస్థాయి సీఈఓలు సదస్సుకు హాజరవనున్నారు. వివిధ రంగాల ప్రముఖులను సదస్సుకు ఆహ్వానించేందుకు స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేరిట ప్రభుత్వం ఆహ్వన లేఖలను పంపిస్తోంది. 'వికసిత్ భారత్-2047 జాతీయ వృద్ధి లక్ష్యాలకు అనుగుణంగా మా ప్రజా ప్రభుత్వం 'తెలంగాణ రైజింగ్ 2047' డాక్యుమెంట్‌ను తయారు చేసింది. ఆర్థిక వృద్ధి, అన్ని రంగాల ప్రగతి, అన్ని వర్గాల సంక్షేమం, సాధికారత, సమ్మిళిత వృద్ధి లక్ష్యంగా భవిష్యత్తు తెలంగాణకు రోడ్‌మ్యాప్‌ను రూపొందించింది. ఈ లక్ష్యాలను.. మా ప్రభుత్వం సంకల్పాన్ని ప్రపంచ వేదికపై ప్రదర్శించేందుకు డిసెంబర్ 8, 9 తేదీల్లో హైదరాబాద్‌లో 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్%-%2025'ను నిర్వహిస్తున్నాము. తప్పకుండా తరలిరండి..' అనే ఆహ్వాన సందేశంతో ఈ లేఖలు పంపించారు. ప్రభుత్వం పంపించిన ఆహ్వానం అందుకున్న ప్రముఖుల్లో కొందరు సదస్సుకు హాజరవుతున్నట్లు ప్రకటించారు. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ రాజవంశానికి చెందిన షేక్ తారిక్ అల్ ఖాసిమీ, రాస్ అల్ ఖైమా, డాయిచ్ బోర్స్ గ్రూప్ హెడ్ లుడ్విగ్ హెయిన్జెల్మాన్, ఎన్రిషన్ వ్యవస్థాపక భాగస్వామి డబ్ల్యూ విన్స్టన్, మాండల్ వైల్డ్ లైఫ్ గ్రూప్ సీఈఓ బెనెట్ నియో తో పాటు పలు టెక్ కంపెనీల సీఈవోలు, పెట్టుబడిదారులు, స్టార్టప్ ఫౌండర్లు ఈ సదస్సుకు హాజరవుతున్నారు. తెలంగాణ ప్రగతి సంక్షేమాన్ని, అన్ని రంగాల్లో సాధించిన అభివృద్ధిని ప్రపంచానికి పరిచయం చేసేందుకు ఈ వేదికను అద్భుతంగా తీర్చిదిద్దాలని ప్రభుత్వం భావిస్తోంది. ప్రపంచం నలుమూలాల నుంచి పెట్టుబడులను ఆకర్షించటంతో పాటు గ్లోబల్ ఇన్నోవేషన్ దిశగా తెలంగాణకు ఉన్న అనుకూలతలను చాటిచెప్పాలని సంకల్పించింది. రెండు రోజుల పాటు జరిగే సదస్సులో డిసెంబర్ 9న తెలంగాణ రైజింగ్ 2047 డాక్యుమెంట్‌ను ముఖ్యమంత్రి ఆవిష్కరిస్తారు. ఈనెల 13న ప్రపంచ ఫుట్‌బాల్ దిగ్గజం లియోనల్ మెస్సీ హైదరాబాద్‌కు రానున్నారు. ఆయన పాల్గొనే వేడుకలోనే ప్రత్యేక ఫుట్‌బాల్ మ్యాచ్ నిర్వహిస్తారు. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సదస్సుకు ఇది ప్రత్యేక ఆకర్షణగా, ముగింపు ఘట్టంగా నిలుస్తుంది.

# ఈవీఎంల తనిఖీకి దరఖాస్తులు రాలేదు: ఈసీ

హైదరాబాద్, నవంబర్ 28 (ఈవార్తలు): జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నికల్లో ఉపయెగించిన ఈవీఎంలకు సంబంధించి రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి కీలక ప్రకటన చేశారు! ఈవీఎంల తనిఖీ కోసం ఒక్క దరఖాస్తు కూడా రాలేదని ఆయన తెలిపారు. ఉప ఎన్నిక ఫలితం ప్రకటించిన తర్వాత నవంబర్ 14 నుంచి 21వ తేదీ వరకు వారం రోజుల నిర్ణీత గడువులో ఎలాంటి దరఖాస్తు రాలేదని ఎన్నికల అధికారులు వెల్లడించారు. ఎన్నికల ఫలితాల ప్రకటన అనంతరం అత్యధిక ఓట్లు పొందిన అభ్యర్థి, ఆ తర్వాత రెండు, మూడు స్థానాల్లో నిలిచిన అభ్యర్థులు కోరితే మొత్తం ఈవీఎంలలో 5 శాతం వరకు బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్ వీవీపాట్‌ల తయారీ సంస్థల ఇంజనీర్ల బృందం ద్వారా తనిఖీ చేసి ధృవీకరించే అవకాశం ఉంటుందని తెలిపారు. ఇందుకోసం ఫలితాల తేదీ నుంచి ఏడు రోజుల లోపు రాతపూర్వకంగా దరఖాస్తు చేయాల్సి ఉంటుందని వివరించారు. ఎన్నికల నిర్వహణ భారత ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలు, నియమాలు, భద్రతా ప్రమాణాలతో పారదర్శకంగా జరిగినట్లు తెలిపారు. కాగా, దేశవ్యాప్తంగా వివిధ ఎన్నికల్లో తమకు వ్యతిరేకంగా వస్తున్న ఫలితాలపై కాంగ్రెస్ విమర్శలు గుప్పిస్తోంది. ఈవీఎం అక్రమాల కారణంగా కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ గెలుస్తోందని ఆరోపణలు చేస్తోంది. ఈ నేపథ్యంలో జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ఫలితంపై ఎలాంటి దరఖాస్తు రాలేదని ఎన్నికల అధికారి ప్రకటించారు.



# కోకాపేటలో ఎకరం 150 కోట్లు

కోకాపేట/హైదరాబాద్, నవంబర్ 28 (ఈవార్తలు): హైదరాబాద్ నగర శివారులోని కోకాపేటలో భూముల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. తాజాగా జరిగిన వేలంలో ఎకరం భూమి ఏకంగా రూ.150 కోట్లకు పైగా పలికింది. గండిపేట మండలం పరిధిలోని కోకాపేటలో ఇటీవల భూముల ధరలు రికార్డు స్థాయిలో నమోదవుతున్నాయి. హెచ్‌ఎండీఏ ఆధ్వర్యంలో కోకాపేట నియోపొలిస్ లేఅవుట్‌లో నిర్వహించిన ఈ-వేలంలో ఎకరం భూమి ధర రూ.151.25 కోట్లకు చేరింది. నియోపొలిస్‌లోని ప్లాట్ నెంబర్ 15, 16లలోని 9.06 ఎకరాలను ప్రభుత్వం వేలం వేయగా రూ.1,353 కోట్ల ఆదాయం లభించింది. గతంలో ప్లాట్ నెంబర్ 17, 18లను వేలం వేయగా ఎకరం రూ.137.25 కోట్లు పలికింది. అంతకుముందు టీజీఐఐసీ భూముల్లో ఎకరా ధర రూ.177 కోట్లుగా నమోదైన విషయం విదితమే. నియోపొలిస్‌లో 2023లో ఎకరా భూమి సగటున రూ.73 కోట్లు పలికింది. ఇప్పుడు ఆ ధర దాదాపు రెండింతలు పెరిగింది




# కాంట్రాక్టర్ల కోసమే కాళేశ్వరం

**కామారెడ్డి జిల్లాలో ఒక్క ఎకరాకూ నీళ్లు రాలే**

**పనులు చేయకున్నా కాంట్రాక్టర్లకు పైసలు ముట్టినయ్**

**నన్ను పంపి శునకానందం పొందుతుండ్రు**

**కుట్ర చేసి నన్ను కేసీఆర్‌కు దూరం చేసిండ్రు**

**తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత**

కామారెడ్డి, నవంబర్ 28 (ఈవార్తలు): కాళేశ్వరం ప్రాజెక్టుతో కామారెడ్డి ప్రాంతంలోని ఒక్క ఎకరానికి కూడా నీళ్లు రాలేదని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆరోపించారు. ఇవాళ ఆమె కామారెడ్డిలో మీడియాతో మాట్లాడారు.. కామారెడ్డి జిల్లాకు ఉద్దేశించిన ప్యాకేజీ 21, 22 ద్వారా కాంట్రాక్టర్లకు డబ్బులు వచ్చాయి కానీ, ప్రజలకు మేలు జరగలేదని విమర్శించారు. కాళేశ్వరం ప్యాకేజ్ 22 ద్వారా కామారెడ్డికి నీళ్లు ఇచ్చేందుకు ప్లాన్ చేశారని ఇందుకు రూ. 1446 కోట్లు అవసరమైతే రూ. 450 కోట్లు మాత్రమే ఇచ్చారన్నారు. దీంతో కామారెడ్డి ప్రాంతానికి నీళ్లు వస్తాయా? అని ప్రశ్నించారు. మొత్తం 1500 ఎకరాల ల్యాండ్ అవసరమైతే రెండో వంతు భూసేకరణ కూడా చేయలేదన్నారు. కొండం చెరువు కెపాసిటీ ని తగ్గించారని, ప్రాజెక్ట్ వ్యయం మాత్రం తగ్గించలేదని అన్నారు. కాళేశ్వరం 21, 22 ప్యాకేజ్ ల కారణంగా ప్రజలకు మేలు జరగలేదని, కాంట్రాక్టర్లకు మాత్రమే డబ్బులు ముట్టాయన్నారు. గత ప్రభుత్వం చేపట్టిన పనులు ఈ ప్రభుత్వం కొనసాగించాలన్నారు. కాళేశ్వరం పనులు కొనసాగించకపోతే కామారెడ్డికి వేరే ఏ మార్గంలో నీళ్లు తెస్తారో ప్రభుత్వం చెప్పాలని అన్నారు. తనను కుట్ర చేసి కుటుంబం నుంచి దూరం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో చాలా బాధపడ్డానని, తనను కుటుంబం నుంచి పంపించిన వారు శునకానందం పొందారని అన్నారు. తాను జైల్లో ఉన్నప్పుడు తన పిల్లల కన్నా కూడా మా అమ్మ ఆరోగ్యం గురించే ఎక్కువ బాధపడ్డానని కవిత అన్నారు. తెలంగాణ అనే మరో కుటుంబం తనకు ఉందని, వారి కోసం ధైర్యంగా పనిచేస్తానని అన్నారు. ఇక కామారెడ్డికి చాలా ప్రత్యేకత ఉందని, ఇక్కడ నుంచే కాంగ్రెస్ పార్టీ బీసీ డిక్లరేషన్ ప్రకటించిందన్నారు. రేవంత్ రెడ్డి బీసీ ద్రోహి అని ఇప్పటికే ప్రకటించామని, బీసీ రిజర్వేషన్ల విషయంలో మొదటి ద్రోహి బీజేపీ, రెండో ద్రోహి కాంగ్రెస్ అని తెలిపారు. ఆ రెండు పార్టీలను తాము నిలదీస్తూనే ఉంటామని అన్నారు. ఇంత అర్జెంట్ గా పంచాయతీ ఎన్నికల అవసరమేముందని కవిత ప్రశ్నించారు. దేశంలో ఏ మార్పు రావాలన్న రాజకీయాల ద్వారానే సాధ్యమని, సర్పంచ్ ఎన్నికల్లో ఓట్ల కోసం వచ్చే పార్టీలను యువత ప్రశ్నించాలని అన్నారు. వారు ఏం చేస్తారో మాట తీసుకోవాలని, గెలిచాక చేయకపోతే తాట తీయాలని పిలుపునిచ్చారు.



# అడుగడుగునా ఖాకీ నిఘా

**జగిత్యాల జిల్లాలో తనిఖీలు ముమ్మరం**

జగిత్యాల టౌన్, నవంబర్ 28 (ఈవార్తలు): సర్పంచ్ ఎన్నికల నేపథ్యంలో జగిత్యాల జిల్లాలో ఏర్పాటు చేసిన ఐదు చెక్ పోస్టులలో పోలీసులు విస్తృత తనిఖీలు చేపట్టారు. జగిత్యాల జిల్లా కేంద్రంలో శుక్రవారం రాత్రి 11:30 గంటల ప్రాంతంలో ప్రధాన రహదారిపై డీసీఆర్బీ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో జగిత్యాల ట్రాఫిక్ పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓటర్లను ప్రలోభపెట్టడానికి డబ్బు తరలింపు, తదితర అంశాలపై దృష్టి పెట్టి వాహనాలను తనిఖీ చేస్తున్నామని వెల్లడించారు. గ్రామపంచాయతీ ఎన్నికలు పూర్తయ్యే వరకు పోలీసుల తనిఖీలు ఉంటాయని, ఇందుకుగానూ ప్రజలు సహకరించాలని కోరారు. తనిఖీల్లో ట్రాఫిక్ ఎస్సై మల్లేశ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఫ్లయింగ్ స్క్వాడ్స్ అప్రమత్తంగా ఉండాలి

**జగిత్యాల కలెక్టర్ సత్యప్రసాద్, ఎస్పీ అశోక్ కుమార్**



జగిత్యాల టౌన్, నవంబర్ 28 (ఈవార్తలు): ఎన్నికల సమయంలో అక్రమ నగదు, మద్యం, ఆయుధాలు వంటి వాటిని తనిఖీ చేసి పట్టుకోవడానికి ఫ్లయింగ్ స్క్వాడ్‌లను నియమించామని జగిత్యాల కలెక్టర్ సత్యప్రసాద్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో ఎన్నికల విధులకు సంబంధించి ఫ్లయింట్ స్క్వాడ్ బృందాలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల నియమావళి ప్రకారం ప్రజలు రూ.50 వేల లోపు నగదు మాత్రమే తీసుకెళ్లాలని, అంతకుమించి తీసుకెళ్తే నగదుకు సంబంధిత పత్రాలు చూపించాలని అన్నారు. ఎన్నికలు నిష్పాక్షికంగా నిర్వహించడంలో ఈ బృందాల పాత్ర కీలకంగా ఉంటుందన్నారు. ప్రత్యేక బృందాల్లో తప్పనిసరిగా మెజిస్ట్రేట్ స్థాయి అధికారి ఒకరు, నలుగురు పోలీసు సిబ్బంది, అవసరమైతే కెమెరామెన్/వెబ్‌క్యామ్ సామగ్రి, ప్రత్యేక వాహనం ఉంటాయి. ఎన్నికల అధికారులు, పోలీసులకు వచ్చే సమాచారం, పౌరులు చేసే ఫిర్యాదుల ఆధారంగా వీరి కార్యాచరణ ఉంటుందని వెల్లడించారు. ఎస్పీ అశోక్ కుమార్ మాట్లాడుతూ.. ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు అప్రమత్తంగా ఉండాలని, వారిని జీపీఎస్ ట్రాక్ సిస్టం ద్వారా నిరంతరాయంగా పరిశీలిస్తామని తెలిపారు. ఎటువంటి సంఘటనలు జరిగినా సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షిస్తామని అన్నారు. ఎన్నికల నిర్వహణలో ఎన్నికల నిర్వహణలో భాగంగా మద్యం, లిక్కర్ తదితర వస్తువులు పట్టుబడ్డ సమయంలో ఫ్లయింగ్ స్క్వాడ్, సర్వేలెన్స్ వీడియో రికార్డ్ తప్పనిసరిగా చేయాలన్నారు. రాజకీయ పార్టీల మీటింగ్స్, బ్యానర్లు మొదలైన సామాగ్రి పై వీడియో సర్వేలెన్స్ టీమ్‌లు రికార్డు చేయాలని తెలిపారు. అనంతరం కలెక్టరేట్ ఆవరణలో ఫ్లయింగ్ స్క్వాడ్ వాహనాలను వీరిద్దరు జెండా ఊపి ప్రారంభించారు.

# అప్పులు తగ్గించుకోవాలి

## గూగుల్ సెంటర్ నిర్మాణంలో వేగం పెంచాలి.. అమరావతి రెండో దశకు శ్రీకారం

**20 వేల ఎకరాల సమీకరణ చేయాలి**

**ఏపీ మంత్రి మండలిలో కీలక నిర్ణయాలు**

అమరావతి, నవంబర్ 28 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రిమండలి సమావేశంలో పలు కీలకమైన, దీర్ఘకాలిక ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని ముఖ్య నిర్ణయాలు తీసుకున్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని బలోపేతం చేయడం, మౌలిక సదుపాయాల కల్పనలో ఎదురయ్యే అడ్డంకులను తొలగించడం, ప్రతిష్ఠాత్మక పారిశ్రామిక ప్రాజెక్టులను వేగవంతం చేయడం వంటి అంశాలపై కేబినెట్ ప్రధానంగా దృష్టి సారించింది. ముఖ్యంగా, రాష్ట్రంపై ఉన్న అధిక వడ్డీ రుణాల భారాన్ని తగ్గించే వ్యూహాత్మక నిర్ణయం ఈ సమావేశంలో అత్యంత ప్రాధాన్యతను సంతరించుకుంది. గతంలో రాష్ట్ర ప్రభుత్వం 11 నుంచి 12 శాతం వంటి అధిక వడ్డీ రేట్లకు వేల కోట్ల రూపాయల రుణాలను సమీకరించింది. ఈ అధిక వడ్డీ చెల్లింపులు రాష్ట్ర ఖజానాపై తీవ్రమైన భారాన్ని మోపుతున్నాయని కేబినెట్ సమావేశంలో చర్చకు వచ్చింది. అయితే, ఇటీవల కాలంలో రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక నిర్వహణ మెరుగుపడటంతో క్రెడిట్ రేటింగ్ పెరిగింది. ఈ సానుకూల పరిణామాన్ని రాష్ట్రానికి అనుకూలంగా మలచుకోవాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం ఉన్న అధిక వడ్డీ రుణాలను, మార్కెట్‌లో తక్కువ వడ్డీకి లభిస్తున్న కొత్త రుణాలతో మార్పిడి ('స్వాప్') చేయాలని ఆర్థిక శాఖకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ ప్రక్రియ ద్వారా వడ్డీల రూపంలో చెల్లించే కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని ఆదా చేయవచ్చని, ఆ నిధులను ఇతర అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు మళ్లించవచ్చని ప్రభుత్వం భావిస్తోంది. ఇది రాష్ట్ర ఆర్థిక క్రమశిక్షణ దిశగా వేస్తున్న ఓ ముఖ్యమైన అడుగుగా నిపుణులు విశ్లేషిస్తున్నారు. మరో కీలక నిర్ణయంలో, రాష్ట్రంలోని పలు ప్రభుత్వ, కేంద్ర ప్రభుత్వ సంస్థలకు ఫైర్ సేఫ్టీ ఎన్‌ఓసీ (నిరభ్యంతర పత్రం) కోసం చెల్లించాల్సిన ముందస్తు జాగ్రత్తల రుసుము నుంచి మినహాయింపు



ఇస్తూ మంత్రిమండలి ఆమోదముద్ర వేసింది. ఏపీ జెన్కో ఛైర్మన్, ఎండీ చేసిన విజ్ఞప్తి మేరకు ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ మినహాయింపు జాబితాలో మంగళగిరి ఎయిమ్స్, రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రభుత్వ భవనాలు, కేంద్ర ప్రభుత్వ సంస్థలు, ఏపీ జెన్కో, ఏపీపీడీసీఎల్ థర్మల్ పవర్ స్టేషన్లు ఉన్నాయి. ఈ నిర్ణయంతో ప్రజాసేవలో ఉన్న ఈ కీలక సంస్థలపై ఆర్థిక భారం తగ్గడమే కాకుండా, పరిపాలన ప్రక్రియలు కూడా సులభతరం కానున్నాయి. రాష్ట్ర ప్రతిష్టను పెంచే గూగుల్ డేటా సెంటర్ ప్రాజెక్టు నిర్మాణాన్ని వేగవంతం చేసే దిశగా కేబినెట్ మరో ముందడుగు వేసింది. ఈ ప్రాజెక్టు నిర్మాణంలో పాలుపంచుకోనున్న ఆరు భాగస్వామ్య కంపెనీలను గుర్తించడానికి ఆమోదం తెలిపింది. గూగుల్ యొక్క 100 శాతం అనుబంధ సంస్థ అయిన 'రైడన్ ఇన్ఫోటెక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్' అభ్యర్థన మేరకు ఈ నిర్ణయం తీసుకున్నారు. అదానీ ఇన్ఫ్రా, అదానీ కోనెక్స్, అదానీ పవర్, భారతీ ఎయిర్‌టెల్, ఎక్స్‌ట్రా డేటా, ఎక్స్‌ట్రా వైజాగ్ లిమిటెడ్ సంస్థలను భాగస్వాములుగా గుర్తించారు. అయితే, ఈ కంపెనీల చేరికతో గతంలో రాష్ట్ర ప్రభుత్వంతో గూగుల్ కుదుర్చుకున్న ప్రధాన ఒప్పందంలోని నిబంధనలైన పెట్టుబడి, నాణ్యత, ప్రాజెక్టు పూర్తి చేసే కాలపరిమితి వంటి అంశాల్లో ఎలాంటి మార్పు ఉండబోదని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ ఆమోదంతో ప్రాజెక్టు పనులు మరింత వేగవంతం కానున్నాయి.

## అమరావతి విస్తరణకు 20 వేల ఎకరాలు

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నిర్మాణంలో మరో కీలక ముందడుగు పడింది. అమరావతిని ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దే లక్ష్యంతో రెండో దశ భూ సమీకరణకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదముద్ర వేసింది. శుక్రవారం ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన జరిగిన కేబినెట్ సమావేశంలో ఈ మేరకు కీలక నిర్ణయం తీసుకున్నారు. ఏడు గ్రామాల పరిధిలో 16,666 ఎకరాల భూమిని ల్యాండ్ పూలింగ్ ద్వారా సమీకరించేందుకు సీఆర్డీఏకు అనుమతి ఇస్తూ మంత్రివర్గం తీర్మానించింది. ప్రభుత్వ భూమితో కలిపి మొత్తంగా 20 వేల ఎకరాలకు పైగా భూమిని సమీకరించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలుస్తోంది. అంతర్జాతీయ పెట్టుబడులు ఆకర్షించాలన్నా, ఎయిర్‌పోర్ట్, స్పోర్ట్స్ సిటీ, రైల్వే స్టేషన్ వంటి భారీ మౌలిక సదుపాయాలు నిర్మించాలన్నా భూమి అత్యవసరం అని ముఖ్యమంత్రి చంద్రబాబు గురువారమే స్పష్టం చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే, కేబినెట్ సమావేశంలో రెండో దశ భూ సమీకరణ ప్రతిపాదనలకు ఆమోదం తెలిపారు. ఈ సమావేశంలో భూసేకరణ చేపట్టబోయే గ్రామాలను కూడా పరిశీలించినట్లు సమాచారం. హరిశ్చంద్రపురం, వైకుంఠపురం, ఎండ్రాయి, కర్లపూడి, వడ్డమాను, పెదమద్దూరు, పెదపరిమి గ్రామాలను అధికారులు ప్రతిపాదించారు. ఆయా గ్రామాల్లో భూ లభ్యత, రికార్డులు, యాజమాన్య వివరాలపై అధికారులు సమర్పించిన నివేదికలను కేబినెట్ పరిశీలించింది. అధికారిక వర్గాల సమాచారం ప్రకారం, వైకుంఠపురంలో 3,361 ఎకరాలు, పెదపరిమిలో 6,513 ఎకరాలు, కర్లపూడిలో 2,944 ఎకరాలు, హరిశ్చంద్రపురంలో 2,418 ఎకరాలు, ఎండ్రాయిలో 2,166 ఎకరాలు, వడ్డమానులో 1,913 ఎకరాలు, పెదమద్దూరులో 1,145 ఎకరాలు సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ 16,666 ఎకరాలతో పాటు ప్రభుత్వ, అసైన్డ్ భూములను కలిపి మొత్తం 20,494 ఎకరాలు సేకరించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఇప్పటికే మొదటి విడతలో రైతుల నుంచి సుమారు 34,000 ఎకరాలను ప్రభుత్వం సమీకరించింది. తాజాగా రెండో విడతలో మరో 20,000 ఎకరాలు సేకరించనున్నారు. వీటికి అదనంగా, సుమారు 16,000 ఎకరాల ప్రభుత్వ భూమిని కూడా సీఆర్డీఏకు అప్పగించనున్నారు. దీంతో రాజధాని నిర్మాణం కోసం మొత్తం దాదాపు 70,000 ఎకరాల భూమి అందుబాటులోకి రానుంది.

# 15 సంస్థలకు నిర్మల శంకుస్థాపన

అమరావతి, నవంబర్ 28 (ఈవార్తలు): ఏపీ రాజధాని అమరావతి నిర్మాణంలో కీలక ముందడుగు పడింది. అమరావతిని ప్రధాన ఆర్థిక కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో 15 బ్యాంకులు మరియు బీమా సంస్థల ప్రధాన కార్యాలయాల నిర్మాణానికి కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ శుక్రవారం ఉదయం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమానికి సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రులు నారా లోకేశ్, పొంగూరు నారాయణ హాజరయ్యారు. రాజధానిలోని సీడ్ యాక్సెస్ రహదారి పక్కన ఉన్న సీఆర్డీఏ ప్రాజెక్ట్ కార్యాలయం వద్ద మొదటి బ్లాక్‌లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ ఆర్థిక సంస్థల ఏర్పాటు ద్వారా రాజధానికి రూ.1,328 కోట్ల పెట్టుబడులు రానున్నాయని, తద్వారా సుమారు 6,514 మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని ఏపీసీఆర్డీఏ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ చారిత్రక కార్యక్రమంలో రాజధాని రైతులు, వ్యవసాయ కూలీలు, మహిళలు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అమరావతిలో కార్యాలయాలను ఏర్పాటు చేయనున్న వాటిలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఎల్ఐసీ, నాబార్డ్, కెనరా బ్యాంక్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ బరోడా, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, పంజాబ్ నేషనల్ బ్యాంక్, ఇండియన్ బ్యాంక్, ఐడీబీఐ వంటి ప్రముఖ జాతీయ సంస్థలు ఉన్నాయి. ఈ పరిణామంతో రాజధాని అభివృద్ధి పనులు వేగవంతం కానున్నాయని ప్రభుత్వం భావిస్తోంది.

## అమరావతిలో కొలువుదీరే సంస్థలివే!

1. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ): రూ.300 కోట్ల పెట్టుబడి, 2000 ఉద్యోగాలు
2. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా: రూ.50 కోట్ల పెట్టుబడి, 160 ఉద్యోగాలు
3. ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు: రూ.256 కోట్ల పెట్టుబడి, 1000 ఉద్యోగాలు
4. సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా: రూ.40 కోట్ల పెట్టుబడి, 300 ఉద్యోగాలు
5. ఏపీ కోఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్ (ఆప్కాబ్): రూ.200 కోట్ల పెట్టుబడి, 400 ఉద్యోగాలు
6. బ్యాంక్ ఆఫ్ ఇండియా: రూ.40 కోట్ల పెట్టుబడి, 200 ఉద్యోగాలు
7. కెనరా బ్యాంక్: రూ.50 కోట్ల పెట్టుబడి, 300 ఉద్యోగాలు
8. బ్యాంక్ ఆఫ్ బరోడా: రూ.60 కోట్ల పెట్టుబడి, 300 ఉద్యోగాలు
9. ఇండియన్ బ్యాంక్: రూ.40 కోట్ల పెట్టుబడి, 105 ఉద్యోగాలు
10. నాబార్డ్: రూ.90 కోట్ల పెట్టుబడి, 160 ఉద్యోగాలు
11. పంజాబ్ నేషనల్ బ్యాంక్: రూ.15 కోట్ల పెట్టుబడి, 150 ఉద్యోగాలు
12. ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్: రూ.4 కోట్ల పెట్టుబడి, 65 ఉద్యోగాలు
13. ఐడీబీఐ బ్యాంక్: రూ.50 కోట్ల పెట్టుబడి, 215 ఉద్యోగాలు
14. లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్ఐసీ): రూ.22 కోట్ల పెట్టుబడి, 1036 ఉద్యోగాలు
15. న్యూ ఇండియా అస్యూరెన్స్ కంపెనీ లిమిటెడ్: రూ.93 కోట్ల పెట్టుబడి, 150 ఉద్యోగాలు



# నేను దిగిపోయాకే దొంగతనం తెలిసింది

**సీఐడీ విచారణలో వైవీ సుబ్బారెడ్డి**

విజయవాడ, నవంబర్ 28 (ఈవార్తలు): తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) పరకామణి కేసులో దర్యాప్తు వేగవంతమైంది. ఈ కేసుకు సంబంధించి టీటీడీ మాజీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి శుక్రవారం విజయవాడలోని సీఐడీ కార్యాలయంలో విచారణకు హాజరయ్యారు. అడిషనల్ డీజీ రవిశంకర్ అయ్యన్నార్ నేతృత్వంలోని బృందం ఆయన్ను సుమారు రెండు గంటల పాటు ప్రశ్నించి, కీలక వివరాలు సేకరించింది. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి స్టేట్‌మెంట్‌ను అధికారులు రికార్డ్ చేశారు. డిసెంబర్ 2వ తేదీలోగా ఈ కేసుపై హైకోర్టుకు నివేదిక సమర్పించాల్సి ఉండటంతో సీఐడీ అధికారులు దర్యాప్తును ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా రెండు రోజుల క్రితం టీటీడీ మాజీ ఈవో ధర్మారెడ్డి, అప్పటి సీఎస్‌వో నరసింహ కిశోర్‌లను కూడా విచారించారు. తాజాగా తిరుపతి ఎస్పీ కార్యాలయం నుంచి కేసుకు సంబంధించిన పత్రాలను విజయవాడ సీఐడీ కార్యాలయానికి తరలించారు. విచారణ అనంతరం వైవీ సుబ్బారెడ్డి మీడియాతో మాట్లాడారు. పరకామణి విషయంలో సీఐడీ అధికారులు అడిగిన అన్ని ప్రశ్నలకు సమాధానం చెప్పానన్నారు. "మీ హయాంలో దొంగతనం జరిగిందా? అని అడిగారు. కానీ, ఆ విషయం నా పదవీకాలం ముగిసిన తర్వాతే బయటపడింది... ఆనాడు ఈ విషయాన్ని ఎవరు దాచిపెట్టారో నాకు తెలియదని చెప్పాను" అని ఆయన వెల్లడించారు. ఈ విచారణను రాజకీయ కోణంలో చూడవద్దని సుబ్బారెడ్డి విజ్ఞప్తి చేశారు. నిష్పక్షపాతంగా విచారణ జరిపి అసలైన దోషులను కఠినంగా శిక్షించాలని కోరారు. దర్యాప్తునకు తన పూర్తి సహకారం ఉంటుందని అధికారులకు హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు.

# అమ్మా.. నేనూ నీ వెంటే!

**మానేరు వాగులో దూకి తల్లి ఆత్మహత్య.. తల్లి శవాన్ని చూసి కొడుకు సూసైడ్**

**రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లిలో విషాదం**

సిరిసిల్ల, నవంబర్ 28 (ఈవార్తలు): తల్లి వాగులో దూకి ఆత్మహత్య చేసుకోవడాన్ని తట్టుకోలేక కొడుకు కూడా అదే వాగులో దూకి ప్రాణాలు వదిలాడు. ఈ విషాదకర ఘటన రాజన్న సిరిసిల్ల జిల్లాలో చోటుచేసుకున్నది. తంగళ్లపల్లి మండల కేంద్రానికి చెందిన మంచికట్ల లలిత–దేవరాజం దంపతులకు కొడుకు అభిలాశ్ (33), కూతుళ్లు మౌనిక, మానస ఉన్నారు. ఇద్దరు కూతుళ్లకు గతంలోనే వివాహం చేశారు. దేవరాజం ఆరేండ్ల క్రితం మురుగు కాలువలో పడి మృతి చెందాడు. కొడుకు అభిలాష్‌కు 2012లో కానిస్టేబుల్ ఉద్యోగం వచ్చింది. ప్రస్తుతం 17వ పోలీస్ బెటాలియన్‌లో పనిచేస్తున్నాడు. అభిలాష్‌కు వివాహం చేయడానికి సంబంధాలు చూస్తున్నారు. భర్త మృతి చెందినప్పటి నుంచి లలిత కొంత అనారోగ్యంతో బాధపడుతున్నది. ఈ క్రమంలో గురువారం ఇంటి నుంచి వెళ్లిన లలిత రాత్రయినా తిరిగిరాలేదు. శుక్రవారం ఉదయం తంగళ్లపల్లి ఠాణాలో కుటుంబసభ్యులు ఫిర్యాదు చేశారు. ఇంతలో సిరిసిల్ల మానేరువాగులో గుర్తుతెలియని మహిళ మృతదేహం లభించడంతో పోలీసులు అక్కడికి చేరుకుని, వెలికి తీశారు. తల్లి మృతదేహాన్ని చూసి కొడుకు అభిలాష్ భోరున విలపించాడు. పోలీసులు, స్థానికులు అందరూ చూస్తుండగానే వారి ముందే అభిలాష్ మానేరువాగులోకి దూకాడు. అక్కడ ఉన్న ఎవరికీ ఈత రాకపోవడంతో కాపాడే ప్రయత్నం చేయలేకపోయారు. తల్లి లలిత, కొడుకు అభిలాశ్ మృతదేహాలను సిరిసిల్లలోని ప్రభుత్వ దవాఖానకు తరలించారు. కేసు నమోదుచేసి, దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

# సిరిసిల్ల జిల్లాలో బీజేపీలోకి భారీ చేరికలు

**కాంగ్రెస్ తాజా మాజీ సర్పంచ్‌లు కమలం గూటికి**

సిరిసిల్ల, నవంబర్ 28 (ఈవార్తలు): వేములవాడ నియోజకవర్గంలో భారతీయ జనతా పార్టీ బీజేపీ బలం మరింత పెరిగింది. కథలాపూర్ మండలంలోని అతిపెద్ద గ్రామాలైన తండ్రియాల్, గంభీర్‌పూర్ నుంచి కాంగ్రెస్ పార్టీకి చెందిన తాజా మాజీ సర్పంచ్‌లు శుక్రవారం బీజేపీలో చేరారు.తండ్రియాల్ తాజా మాజీ సర్పంచ్, కాంగ్రెస్ ముఖ్య నాయకులు గడీల గంగా ప్రసాద్, గంభీర్‌పూర్ మాజీ సర్పంచ్ గుంటుక మనోహర్లు వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ చెన్నమనేని వికాస్ ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా డాక్టర్ వికాస్ మాట్లాడుతూ గ్రామాల్లో నిజమైన అభివృద్ధి కేవలం బీజేపీతోనే సాధ్యమవుతుందని ప్రజలు గ్రహించారని తెలిపారు. బీజేపీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థులను గెలిపించి, గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు.ఈ చేరికలు నియోజకవర్గంలో బీజేపీకి మరింత బలాన్ని చేకూర్చాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మల్యాల మారుతి, జిల్లా ఉపాధ్యక్షులు రాచమడుగు వెంకటేశ్వర రావు, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు కొడిపెల్లి గోపాల్ రెడ్డి, సీనియర్ నాయకులు బద్రి సత్యం, ఆనంద్ రెడ్డి, జెలందర్, శ్రీను, తిరుపతి, గంగా మల్లయ్య, రాజేష్, లింగమూర్తి, సాయిరెడ్డితో పాటు పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పార్టీలో చేరిన నాయకులకు వారు కండువాలు కప్పి స్వాగతం పలికారు.

# తీవ్ర రూపం దాల్చిన దిత్వా తుపాను

**ఏపీలో అత్యంత భారీ వర్షాలు**

వైజాగ్, నవంబర్ 28 (ఈవార్తలు): నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన 'దిత్వా' తుపాను తీవ్రరూపం దాల్చింది. ఇది శ్రీలంక తీర ప్రాంతం మీదుగా పయనిస్తూ మరింత బలపడింది. దీని ప్రభావంతో రాగల మూడు రోజుల పాటు తమిళనాడు, పుదుచ్చేరి తీర ప్రాంతాలతో పాటు దక్షిణ ఆంధ్రప్రదేశ్‌లో 'అత్యంత భారీ వర్షాలు' కురుస్తాయని భారత వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. ప్రస్తుతం ఈ తుపాను వాయవ్య దిశగా కదులుతూ, బంగాళాఖాతంలో కారైకాల్‌కు ఆగ్నేయంగా 320 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉందని అధికారులు ధృవీకరించారు. ఈ తుపాను ఆదివారం ఉదయానికి ఉత్తర తమిళనాడు, దక్షిణ ఆంధ్రప్రదేశ్ తీరాలకు అత్యంత సమీపంగా రానుందని ఐఎండీ అంచనా వేసింది. "శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు తమిళనాడు తీరంలో అక్కడక్కడా కుండపోతగా అతి భారీ వర్షాలు కురిసే ప్రమాదం ఉంది. జిల్లా యంత్రాంగాలు అప్రమత్తంగా ఉండాలి" అని ప్రాంతీయ వాతావరణ కేంద్రం సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. ముఖ్యంగా ఆదివారం దక్షిణ కోస్తాంధ్ర, తీర ప్రాంత రాయలసీమలోనూ అత్యంత భారీ వర్షాలు నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ స్పష్టం చేసింది. తుపాను తీరం దాటే సమయంలో గంటకు 70–80 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని, కొన్నిసార్లు వీటి వేగం గంటకు 90 కిలోమీటర్లకు చేరుకోవచ్చని హెచ్చరించింది. సముద్రం అత్యంత అల్లకల్లోలంగా ఉంటుందని, అలలు ఎగిసిపడతాయని పేర్కొంది. ఈ నేపథ్యంలో డిసెంబర్ 1వ తేదీ వరకు తమిళనాడు, పుదుచ్చేరి, దక్షిణ ఆంధ్రప్రదేశ్ తీరాల్లో మత్స్యకారులు వేటకు వెళ్లడాన్ని పూర్తిగా నిలిపివేయాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు.

# జగన్‌కు పేరొస్తుందనే కుట్ర

**కూటమి సర్కారుపై బొత్స విమర్శలు**

వైజాగ్, నవంబర్ 28 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం వైద్య రంగాన్ని నిర్వీర్యం చేసేలా వ్యవహరిస్తోందని, ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటుపరం చేసేందుకు కుట్ర పన్నుతోందని వైసీపీ ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ తీవ్రంగా ఆరోపించారు. ప్రభుత్వ విధానాల వల్ల పేద ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తాడేపల్లిలోని వైసీపీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బొత్స మాట్లాడారు. భుత్వ మెడికల్ కళాశాలలను పబ్లిక్–ప్రైవేట్ పార్టనర్‌షిప్ (పీపీపీ) విధానం పేరుతో ప్రైవేటు సంస్థలకు కట్టబెట్టే ప్రయత్నాన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని బొత్స స్పష్టం చేశారు. "ప్రజారోగ్యం ప్రభుత్వ చేతుల్లోనే ఉండాలి. ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో పెడితే పేదలకు అన్యాయం జరుగుతుంది. ఈ ప్రైవేటీకరణ ద్వారా లబ్ధి పొందాలనే చంద్రబాబు దుర్బుద్ధి బయటపడుతోంది" అని ఆయన విమర్శించారు. ఈ పీపీపీ విధానానికి వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రజల నుంచి సంతకాల రూపంలో అభిప్రాయాలు సేకరిస్తామని తెలిపారు. అనంతరం వైఎస్ జగన్ నేతృత్వంలో వాటిని రాష్ట్ర గవర్నర్‌కు అందజేస్తామని వెల్లడించారు. ఇందుకోసం గురువారమే గవర్నర్ అపాయింట్‌మెంట్ కోరినట్లు చెప్పారు. గతంలో వైఎస్ జగన్ ప్రభుత్వం పేద విద్యార్థులకు వైద్య విద్య అందుబాటులోకి తేవాలనే లక్ష్యంతో ప్రతి జిల్లాకు ఒక మెడికల్ కళాశాలను మంజూరు చేసిందని బొత్స గుర్తు చేశారు. వీటిలో 5 కళాశాలలు పూర్తికాగా, 12 నిర్మాణ దశలో ఉన్నాయన్నారు. జగన్‌కు మంచి పేరు వస్తుందనే దుగ్ధతోనే చంద్రబాబు ప్రభుత్వం ఇప్పుడు వాటిని ప్రైవేటుపరం చేసేందుకు పీపీపీ మోడల్‌ను తెరపైకి తెచ్చిందని బొత్స ఆరోపించారు.

# ఏపీలో పంచాయతీల విభజనపై నిషేధం ఎత్తివేత

అమరావతి, నవంబర్ 28 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గ్రామ పంచాయతీల పునర్వ్యవస్థీకరణపై కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో గ్రామ పంచాయతీల విభజన, విలీనం, పునర్వ్యవస్థీకరణపై గత ఐదేళ్లుగా అమల్లో ఉన్న నిషేధాన్ని తక్షణమే ఎత్తివేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నిర్ణయంతో రాష్ట్రంలో పరిపాలనా సౌలభ్యం కోసం కొత్త గ్రామ పంచాయతీల ఏర్పాటుకు, ఇప్పటికే ఉన్నవాటిని సమీప పట్టణ స్థానిక సంస్థల్లో విలీనం చేసేందుకు మార్గం సుగమమైంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రక్రియను ప్రారంభించేందుకు 2020 మార్చిలో ప్రభుత్వం పంచాయతీల పునర్వ్యవస్థీకరణపై పూర్తిస్థాయిలో నిషేధం విధించింది. దీని ప్రకారం, పెద్ద గ్రామ పంచాయతీలను విభజించడం, చిన్న పంచాయతీలను సమీపంలోని నగర పంచాయతీలు, మున్సిపాలిటీలలో విలీనం చేయడం వంటి ప్రక్రియలు నిలిచిపోయాయి. అయితే, ఈ నిషేధాన్ని ఎత్తివేయాలని కోరుతూ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ ఇటీవల ప్రభుత్వానికి లేఖ రాశారు. ఈ ప్రతిపాదనను క్షుణ్ణంగా పరిశీలించిన ప్రభుత్వం, నిషేధాన్ని తొలగించాలని నిర్ణయించింది. మేరకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్ జీవో నెం. 97ను జారీ చేశారు. తదుపరి అవసరమైన చర్యలు చేపట్టాలని పంచాయతీరాజ్ కమిషనర్‌ను ఈ ఉత్తర్వుల్లో ఆశించారు. ప్రభుత్వ తాజా నిర్ణయంతో రాష్ట్రంలో కొత్త పంచాయతీల ఏర్పాటు ప్రక్రియ మళ్లీ ప్రారంభం కానుంది.

# విమానాల్లో ఇరుముడికి అనుమతి

## అయ్యప్ప స్వాములకు కేంద్రం శుభవార్త.. కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు ప్రకటన



న్యూఢిల్లీ: శబరిమల యాత్రకు వెళ్లే అయ్యప్ప భక్తులకు కేంద్ర ప్రభుత్వం ఎంతో ఆనందకరమైన వార్తను అందించింది. ఇకపై విమాన ప్రయాణాల్లో పవిత్ర ఇరుముడిని (కొబ్బరికాయతో సహా) చేతి సామాను (హ్యాండ్ లగేజ్)గా తమతో పాటే క్యాబిన్‌లోకి తీసుకెళ్లేందుకు అనుమతినిచ్చింది. ఈ మేరకు కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు శుక్రవారం అధికారికంగా ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ నిర్ణయం దేశవ్యాప్తంగా ఉన్న లక్షలాది మంది అయ్యప్ప భక్తులకు గణనీయమైన ఊరట కల్పించనుంది. వాస్తవానికి, ఇప్పటివరకు ఉన్న కఠినమైన విమానయాన భద్రతా నిబంధనల ప్రకారం, ఇరుముడిలోని కొబ్బరికాయ కారణంగా దానిని తప్పనిసరిగా చెక్-ఇన్ లగేజీలో ఉంచాల్సి వచ్చేది. తమ భక్తికి, దీక్షకు ప్రతీకగా భావించే ఇరుముడిని లగేజీలో పంపడం చాలా మంది భక్తులకు అసౌకర్యంగా, ఇబ్బందికరంగా ఉండేది. ఈ సమస్యను తీవ్రంగా పరిగణించిన మంత్రి రామ్మోహన్ నాయుడు, భక్తుల విశ్వాసాలను, మనోభావాలను గౌరవిస్తూ ఈ విషయంలో ప్రత్యేక చొరవ తీసుకున్నారు. పౌరవిమానయాన మంత్రిత్వ శాఖ, సంబంధిత భద్రతా సంస్థలతో చర్చలు జరిపి ఈ ప్రత్యేక మినహాయింపునకు మార్గం సుగమం చేశారు. ఈ ప్రత్యేక వెసులుబాటు నేటి (నవంబర్ 28) నుంచి 2026 జనవరి 20వ తేదీ వరకు దేశవ్యాప్తంగా అమల్లో ఉంటుందని మంత్రి స్పష్టం చేశారు. ఈ కాలంలో శబరిమల యాత్రకు విమానాల్లో వెళ్లే భక్తులు, ఎయిర్‌పోర్టులో అవసరమైన భద్రతా తనిఖీలను పూర్తి చేసిన తర్వాత, తమ ఇరుముడిని విమానం లోపలికి హ్యాండ్ లగేజ్ గా తీసుకెళ్లవచ్చు. అయితే, ఈ సౌకర్యాన్ని వినియోగించుకునే భక్తులు విమానాశ్రయాల్లో భద్రతా సిబ్బందికి సంపూర్ణంగా సహకరించాలని రామ్మోహన్ నాయుడు విజ్ఞప్తి చేశారు. ఇరుముడి స్క్రీనింగ్, తనిఖీ ప్రక్రియలో అధికారుల సూచనలను తప్పనిసరిగా పాటించాలని కోరారు. మండల పూజ, మకరవిళక్కు ఉత్సవాల నేపథ్యంలో దేశం నలుమూలల నుంచి భక్తులు శబరిమలకు పయనమవుతున్న తరుణంలో ఈ ప్రకటన వెలువడటం వారికి ఎంతగానో మేలు చేయనుంది. ఈ నిర్ణయంతో అయ్యప్ప భక్తుల ప్రయాణం మరింత సులభతరం అవుతుందని, వారంతా స్వామివారి ఆశీస్సులతో సుఖసంతోషాలతో ఉండాలని మంత్రి రామ్మోహన్ నాయుడు ఆకాంక్షించారు.

# హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకుకు 91 లక్షల జరిమానా

న్యూఢిల్లీ: ప్రముఖ ప్రైవేట్ రంగ బ్యాంకింగ్ దిగ్గజం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌కు భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్బీఐ) భారీ జరిమానా వడ్డించింది. పలు నిబంధనలను




ఉల్లంఘించినందుకు బ్యాంకుపై రూ.91 లక్షల జరిమానా విధించినట్లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. దీంతో పాటు మన్నకృష్ణ ఇన్వెస్ట్‌మెంట్స్ ప్రైవేట్ లిమిటెడ్ అనే సంస్థకు కూడా రూ.3.10 లక్షల ఫైన్ విధించింది. బ్యాంకింగ్ రెగ్యులేషన్ యాక్ట్‌లోని పలు సెక్షన్లను హెచ్‌డీఎఫ్‌సీ ఉల్లంఘించినట్లు ఆర్బీఐ పేర్కొంది. ముఖ్యంగా రుణాలపై వడ్డీ రేట్లు, కేవైసీ నిబంధనలు, ఆర్థిక సేవల అవుట్‌సోర్సింగ్ వంటి అంశాలలో ఆర్బీఐ ఆదేశాలను పాటించలేదని తెలిపింది. ఒకే కేటగిరీ రుణాలకు పలు రకాల బెంచ్‌మార్కులను ఉపయోగించినట్లు తనిఖీల్లో తేలింది. అంతేకాకుండా, బ్యాంకుకు చెందిన ఒక అనుబంధ సంస్థ నిబంధనలకు విరుద్ధమైన వ్యాపారాన్ని నిర్వహించినట్లు ఆర్బీఐ గుర్తించింది. మరోవైపు, నాన్-బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీ అయిన మన్న కృష్ణ ఇన్వెస్ట్‌మెంట్స్‌లో పాలనాపరమైన లోపాలు ఉన్నట్లు ఆర్బీఐ కనుగొంది. ఆర్బీఐ నుంచి ముందస్తు అనుమతి లేకుండా డైరెక్టర్‌ను నియమించడం ద్వారా యాజమాన్యంలో మార్పులకు కారణమైనందుకు జరిమానా విధించింది. అయితే ఈ జరిమానాలు కేవలం నియంత్రణాపరమైన లోపాలకు సంబంధించినవేనని, వినియోగదారుల లావాదేవీల చెల్లుబాటుపై ఎలాంటి ప్రభావం చూపవని ఆర్బీఐ స్పష్టం చేసింది. కాగా, సెప్టెంబర్‌లో కూడా దుబాయ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ అథారిటీ అక్కడి హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ బ్రాంచ్ కొత్త ఖాతాదారులను చేర్చుకోకుండా నిషేధం విధించిన విషయం తెలిసిందే.

# థాయ్‌లాండ్ అల్లకల్లోలం

**ముంచెత్తిన వరదలు... 145 మంది మృతి**

**సోంగ్‌ఖ్లా ప్రావిన్స్‌లో 110 మంది మృతి**

**వరదలకు 36 లక్షల మంది ప్రజలు ప్రభావితం**







న్యూఢిల్లీ: దక్షిణ థాయ్‌లాండ్‌లో సంభవించిన తీవ్ర వరదలు పెను విషాదాన్ని మిగిల్చాయి. ఈ జల ప్రళయంలో మరణించిన వారి సంఖ్య 145కి చేరినట్లు అధికారులు శుక్రవారం వెల్లడించారు. అసోసియేటెడ్ ప్రెస్ కథనం ప్రకారం, కొన్ని రోజులుగా కురుస్తున్న కుండపోత వర్షాల కారణంగా 12 దక్షిణ ప్రావిన్సుల్లోని 12 లక్షల కుటుంబాలకు చెందిన సుమారు 36 లక్షల మంది ప్రజలు తీవ్రంగా ప్రభావితమయ్యారు. వరద నీరు నెమ్మదిగా తగ్గుముఖం పడుతుండటంతో సహాయక చర్యలు ముమ్మరం చేసినట్లు విపత్తు నివారణ శాఖ తెలిపింది. ప్రభుత్వ అధికార ప్రతినిధి సిరిపాంగ్ అంగ్‌కాసాకుల్కియాట్ మాట్లాడుతూ... ఎనిమిది ప్రావిన్సుల్లో 145 మంది మరణించగా, ఒక్క సోంగ్‌ఖ్లా ప్రావిన్స్‌లోనే 110 మంది ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. ముఖ్యంగా, ఆ ప్రాంతంలోని అతిపెద్ద నగరమైన హ్యాట్ యాయ్‌లో వరద తగ్గాక, శిథిలాల కింద చిక్కుకున్న మరిన్ని మృతదేహాలను సహాయక బృందాలు వెలికితీస్తున్నాయి. పరిస్థితి తీవ్రత దృష్ట్యా ప్రధాని అనుతిన్ చార్న్‌విరాకుల్ సోంగ్‌ఖ్లాలో అత్యవసర పరిస్థితిని ప్రకటించారు. ఇది మునుపెన్నడూ చూడని విపత్తు అని ఆయన అభివర్ణించారు. స్థానిక ఆసుపత్రులపై భారం తగ్గించడానికి హ్యాట్ యాయ్ హాస్పిటల్ కోసం ప్రత్యేకంగా ఎనిమిది ఫీల్డ్ ఆసుపత్రులను ఏర్పాటు చేశారు. అత్యవసర వైద్యం అవసరమైన 20 మంది రోగులను గురువారం హెలికాప్టర్ల ద్వారా సురక్షిత ప్రాంతాలకు తరలించారు. హ్యాట్ యాయ్ జిల్లాలో ఏర్పాటు చేసిన 16 పునరావాస కేంద్రాలకు 16,000 మందికి పైగా ప్రజలను తరలించినట్లు అధికారులు తెలిపారు. గతవారం కేవలం మూడు రోజుల్లోనే హ్యాట్ యాయ్, దాని పరిసర ప్రాంతాల్లో 630 మిల్లీమీటర్ల (25 అంగుళాలు) రికార్డు స్థాయి వర్షపాతం నమోదైంది. వరదల కారణంగా రోడ్లు కొట్టుకుపోవడం, విద్యుత్ స్తంభాలు నేలకూలడం, వాహనాలు ఒకదానిపై ఒకటి పేరుకుపోవడం వంటి దృశ్యాలు కనిపిస్తున్నాయి. అనేక ప్రాంతాల్లో విద్యుత్, నీటి సరఫరా, కమ్యూనికేషన్ వ్యవస్థలు పూర్తిగా స్తంభించాయి. ఒకప్పుడు మార్కెట్లు, స్ట్రీట్ ఫుడ్‌తో పర్యాటకులను ఆకర్షించే హ్యాట్ యాయ్ నగరం ఇప్పుడు పూర్తిగా బురదమయంగా మారింది. ఇళ్లు, వ్యాపార సముదాయాల్లో పేరుకుపోయిన బురదను, శిథిలాలను తొలగించేందుకు స్థానికులు శ్రమిస్తున్నారు.

# 50 లక్షల బీమా కోసం డమ్మీ శవంతో అంత్యక్రియలు

**ఢిల్లీకి చెందిన కమల్ సోమానీకి 50 లక్షల అప్పు**

**అప్పు నుంచి తప్పించుకోవడానికి ఎత్తులు**

లక్నో: ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన వ్యక్తులు బీమా సొమ్ము కోసం ఒక బొమ్మతో నకిలీ అంత్యక్రియలు చేశారు. వారి పథకానికి అధికారులు విస్తుపోయారు. హర్యానాకు చెందిన నలుగురు వ్యక్తులు యూపీలోని గర్హ్‌ముక్తేశ్వర్ గంగా ఘాట్‌కు అంత్యక్రియలు చేయడానికి ఒక శవాన్ని తీసుకువచ్చారు. ఆచారాల ప్రకారం అంత్యక్రియలు చేయడానికి బదులు, నేరుగా చితిపైకి శవాన్ని తీసుకువెళ్లి దహన సంస్కారాలు ప్రారంభించారు. ఆ నలుగురి తీరు అనుమానాస్పదంగా ఉండటంతో స్థానికులు దహన సంస్కారాలను అడ్డుకున్నారు. శవంపై ఉన్న వస్త్రాన్ని తొలగించి చూడగా, ప్లాస్టిక్ డమ్మీ శవం కనిపించింది. స్థానికులు గుమికూడటంతో వారు అక్కడి నుంచి తప్పించుకోవడానికి ప్రయత్నించగా, స్థానికులు ఇద్దరిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. మరో ఇద్దరు పరారయ్యారు. పోలీసులు నిందితులను ప్రశ్నించగా విస్తుపోయే విషయం వెలుగులోకి వచ్చింది. తొలుత, ఢిల్లీ ఆసుపత్రి తమకు అసలు శవానికి బదులు డమ్మీ శవం ఇచ్చిందని నమ్మబలికే ప్రయత్నం చేశారు. కానీ పోలీసులు తమదైన శైలిలో విచారించగా అసలు విషయం చెప్పారు. ఢిల్లీలోని కైలాస్‌పురికి చెందిన కమల్ సోమానీ రూ.50 లక్షలకు పైగా అప్పులు చేసినట్లు గుర్తించారు. దాని నుంచి తప్పించుకోవడానికి అతను ఉత్తమ్ నగర్‌కు చెందిన స్నేహితుడు ఆశిష్ ఖురానాతో కలిసి పథకం రచించాడు. ఈ పథకంలో భాగంగా కమల్ సోమానీ గతంలో తన వద్ద పనిచేసిన అన్షుల్ కుమార్ ఆధార్, పాన్ కార్డులను తీసుకున్నాడు. ఏడాది క్రితం అన్షుల్ పేరు మీద రూ.50 లక్షల జీవిత బీమా పాలసీని కొనుగోలు చేసి, క్రమం తప్పకుండా ప్రీమియం చెల్లించాడు. ఆ బీమా డబ్బు కోసం అన్షుల్ మరణించాడని నమ్మించేలా నకిలీ మరణ ధృవీకరణ పత్రాన్ని పొందాడు. అనంతరం స్నేహితుల సహాయంతో శవాన్ని దహనం చేస్తున్నట్లు అందరినీ నమ్మించడానికి నకిలీ అంత్యక్రియలు చేసే ప్రయత్నం చేశాడు. పోలీసులు అన్షుల్‌ను సంప్రదించగా, తాను ఆరోగ్యంగా ఉన్నానని, తన పేరు మీద పాలసీ ఉన్న విషయం కూడా తెలియదని చెప్పాడు. దీంతో పోలీసులు కమల్ సోమానీని, అతడి స్నేహితుడిని అరెస్టు చేశారు. పరారైన ఇద్దరి కోసం గాలిస్తున్నారు.

# థర్డ్ కంట్రీస్ నుంచి అమెరికాకు రానివ్వ!

**అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కీలక వ్యాఖ్యలు**



వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వలస విధానంపై సంచలన నిర్ణయం తీసుకున్నారు. వైట్ హౌస్ సమీపంలో ఆఫ్ఘనిస్థాన్‌కు చెందిన ఓ వలసదారుడు ఇద్దరు నేషనల్ గార్డ్ సభ్యులపై కాల్పులు జరిపిన ఘటన నేపథ్యంలో.. మూడవ ప్రపంచ దేశాల (అభివృద్ధి పరంగా వెనుకబడిన పేద దేశాలను గతంలో అలా పిలిచేవారు) నుంచి వలసలను శాశ్వతంగా నిలిపివేస్తున్నట్లు ప్రకటించారు. ఈ కాల్పుల్లో తీవ్రంగా గాయపడిన ఓ నేషనల్ గార్డ్ చికిత్స పొందుతూ చనిపోయారు. మరోకరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఇక, తాజాగా ట్రంప్ తీసుకున్న ఈ నిర్ణయం వల్ల ఉద్యోగాలు, విద్య, ఆశ్రయం కోసం అమెరికాకు వెళ్లే లక్షలాది మందిపై తీవ్ర ప్రభావం పడనుంది. ట్రూత్ సోషల్ వేదికగా ఆయన ఈ వివరాలను పంచుకున్నారు. అమెరికా సాంకేతికంగా పురోగతి సాధించినప్పటికీ, ప్రస్తుత వలస విధానం దేశ ప్రజల జీవన ప్రమాణాలను దెబ్బతీసిందని ఆరోపించారు. "అమెరికా వ్యవస్థ పూర్తిగా కోలుకోవడానికి మూడవ ప్రపంచ దేశాల నుంచి వలసలను శాశ్వతంగా నిలిపివేస్తాను. బైడెన్ హయాంలో అక్రమంగా దేశంలోకి వచ్చిన లక్షలాది మంది అనుమతులను రద్దు చేస్తాను. అమెరికాకు ఆస్తిగా కాకుండా భారంగా మారిన వారిని, మన దేశాన్ని ప్రేమించలేని వారిని తొలగిస్తాను" అని ట్రంప్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. అంతేకాకుండా దేశ పౌరులు కానివారికి అన్ని రకాల ఫెడరల్ ప్రయోజనాలు, సబ్సిడీలను రద్దు చేస్తామని ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వాలపై ఆధారపడేవారిని, దేశ భద్రతకు ముప్పుగా మారేవారిని, పాశ్చాత్య నాగరికతకు అనుకూలంగా లేనివారిని దేశం విడిచి పంపిస్తామని హెచ్చరించారు. "ఈ పరిస్థితిని 'రివర్స్ మైగ్రేషన్' ద్వారానే సరిదిద్దగలం" అని ఆయన అభిప్రాయపడ్డారు. కాగా, అమెరికా వలసలను నిలిపివేసిన దేశాల జాబితాలో ఆఫ్రికా, ఆసియా, దక్షిణ అమెరికా ఖండాలకు చెందిన దేశాలు ఉన్నాయి. ఈ జాబితాలో ఆఫ్ఘనిస్థాన్, మయన్మార్, ఇరాన్, క్యూబా, వెనెజులా, యెమెన్ వంటి దేశాలు ఉండటం గమనార్హం.

**వలసలను నిలిపివేసిన 'థర్డ్ వరల్డ్' దేశాల జాబితా ఇదే:**

ఆఫ్ఘనిస్థాన్, మయన్మార్, బురుండి, చాద్, రిపబ్లిక్ ఆఫ్ కాంగో, క్యూబా, ఈక్వటోరియల్ గినియా, ఎరిత్రియా, హైతీ, ఇరాన్, లావోస్, లిబియా, సియెర్రా లియోన్, సోమాలియా, సూడాన్, టోగో, తుర్క్‌మెనిస్థాన్, వెనెజూలా, యెమెన్.



# స్వల్ప నష్టాల్లో సెన్సెక్స్, నిఫ్టీ

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లు శుక్రవారం ఫ్లాట్‌గా ముగిశాయి. మిశ్రమ అంతర్జాతీయ సంకేతాల నేపథ్యంలో ఇన్వెస్టర్లు అప్రమత్తంగా వ్యవహరించడంతో రోజంతా సూచీలు పరిమిత శ్రేణిలోనే కదలాడాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి, సెన్సెక్స్ 13.71 పాయింట్లు స్వల్పంగా నష్టపోయి 85,706.67 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 12.6 పాయింట్లు క్షీణించి 26,202.95 వద్ద ముగిసింది. రోజంతా నిఫ్టీ 26,190 నుంచి 26,281 పాయింట్ల మధ్యే ట్రేడ్ అయింది. 26,281 స్థాయి వద్ద నిఫ్టీకి బలమైన నిరోధం ఎదురైందని విశ్లేషకులు తెలిపారు. 26,150-26,000 స్థాయిలు కీలక మద్దతుగా ఉన్నంతవరకు మార్కెట్ ధోరణి స్థిరంగా ఉంటుందని వారు అభిప్రాయపడ్డారు. 26,280-26,310 శ్రేణిని దాటితేనే మార్కెట్‌లో స్పష్టమైన దిశానిర్దేశం ఉంటుందని వివరించారు. సెన్సెక్స్ షేర్లలో హిందుస్థాన్ యూనిలీవర్, సన్ ఫార్మా, మహీంద్రా, కోటక్ మహీంద్రా బ్యాంక్ షేర్లు లాభపడి మార్కెట్లకు మద్దతుగా నిలిచాయి. మరోవైపు, పవర్ గ్రిడ్, భారతీ ఎయిర్‌టెల్, ఎటర్నల్, ఇన్ఫోసిస్ షేర్లు నష్టపోయి సూచీలపై ఒత్తిడి పెంచాయి. రంగాల వారీగా మిశ్రమ స్పందన కనిపించింది. నిఫ్టీ ఐటీ, రియల్టీ, ఆయిల్ %డ% గ్యాస్ సూచీలు 0.69 శాతం వరకు నష్టపోయాయి. అయితే, నిఫ్టీ ఆటో 0.62 శాతం, నిఫ్టీ ఫార్మా 0.59 శాతం మేర లాభపడ్డాయి. బ్రాడర్ మార్కెట్లలో నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 ఇండెక్స్ 0.11 శాతం, స్మాల్‌క్యాప్ 100 ఇండెక్స్ 0.27 శాతం చొప్పున నష్టపోయాయి. అమెరికా బాండ్ లాభాలు తగ్గడం, దేశీయ సంస్థాగత మదుపరుల నుంచి కొనుగోళ్ల మద్దతు కొనసాగడం సానుకూలంగా ఉన్నప్పటికీ, రూపాయి విలువలో అస్థిరత, కొన్ని బ్యాంకు కౌంటర్లలో లాభాల స్వీకరణ కారణంగా ట్రేడర్లు అప్రమత్తంగా వ్యవహరించారని మార్కెట్ వర్గాలు పేర్కొన్నాయి.

# డిసెంబర్ 4న భారత్‌కు పుతిన్



న్యూఢిల్లీ/మాస్కో: రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ భారత పర్యటన ఖరారైంది. 23వ భారత్-రష్యా వార్షిక శిఖరాగ్ర సమావేశంలో పాల్గొనేందుకు ఆయన డిసెంబర్ 4, 5 తేదీల్లో భారతదేశంలో పర్యటించనున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ఆహ్వానం మేరకు పుతిన్ భారత్‌కు వస్తున్నారని, ఈ పర్యటన తేదీలను భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ శుక్రవారం అధికారికంగా ప్రకటించింది. రష్యా వార్తా సంస్థ క్రెమ్లిన్ కూడా ఈ విషయాన్ని ధృవీకరించింది. ఈ పర్యటనలో భాగంగా పుతిన్ ఢిల్లీలో ప్రధాని మోదీతో కీలక చర్చలు జరుపుతారు. ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు, వ్యూహాత్మక భాగస్వామ్యం, వాణిజ్యం సహా పలు కీలక అంశాలపై ఈ సమావేశంలో చర్చిస్తారు. ఈ సదస్సు రెండు దేశాల మధ్య సంబంధాలను మరింత బలోపేతం చేస్తుందని విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో పేర్కొంది. పర్యటన సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము.. రష్యా అధ్యక్షుడు పుతిన్ గౌరవార్థం ప్రత్యేక విందును ఏర్పాటు చేయనున్నారు. ఈ విందుకు ప్రధాని మోదీ, పలువురు కేంద్ర మంత్రులు కూడా హాజరవుతారు. ఈ శిఖరాగ్ర సమావేశం ద్వారా ఇరు దేశాల మధ్య సహకారానికి స్పష్టమైన దిశానిర్దేశం లభిస్తుందని, ఇది ఉభయ దేశాల పురోగతికి ప్రయోజనం చేకూరుస్తుందని భావిస్తున్నారు.

# దేనికీ తొందరపడను: డీకే శివకుమార్



బెంగళూరు: కర్ణాటకలో ముఖ్యమంత్రి మార్పు అంశంపై చర్చ కొనసాగుతూనే ఉంది. ఈ నెలాఖరు లోగా పార్టీ అధిష్ఠానం దీనిపై ఒక నిర్ణయం తీసుకుంటుందని ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ చేస్తున్న వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారుతున్నాయి. "దేనికీ తొందరపడకూడదు. ముఖ్యమంత్రి అంశంపై పార్టీ అధిష్ఠానం నిర్ణయం తీసుకుంటుంది" అని తాజాగా డీకే శివకుమార్ అన్నారు. తనది ఏ వర్గమూ కాదని, కాంగ్రెస్ పార్టీయే తన వర్గమని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రంలోని అన్ని వర్గాలను సమానంగా చూస్తానని చెప్పారు. తనకు ఏమీ వద్దని, దేనికీ తొందరపడబోనని అన్నారు. ఈ సందర్భంగా ఆయన సోనియా గాంధీ అంశాన్ని ప్రస్తావించారు. 2004లో కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వం విజయం సాధించినప్పటికీ ప్రధానమంత్రి అయ్యే అవకాశాన్ని సోనియా గాంధీ వదులుకున్నారని గుర్తు చేశారు. తనకు వచ్చిన అవకాశాన్ని మన్మోహన్ సింగ్‌కు ఇచ్చారని ఆయన పేర్కొన్నారు. అంతకుముందు, తమ మధ్య ఐక్యత ఉందని సూచిస్తూ ఇద్దరు కలిసి ఉన్న ఫొటోను శుక్రవారం ఉదయం ముఖ్యమంత్రి సిద్ధరామయ్య 'ఎక్స్'లో పోస్టు చేశారు. ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని నిన్న డీకే శివకుమార్ పోస్టు చేయగా, ప్రజలు ఐదేళ్లు పాలించేందుకు తీర్పు ఇచ్చారని సిద్ధరామయ్య పేర్కొన్నారు. ఇలాంటి వ్యాఖ్యలతో కాంగ్రెస్ వర్గాల్లో అయోమయం నెలకొంది.

# సిద్ధరామయ్య ఫొటోలో డీకే

బెంగళూరు: కర్ణాటకలో ముఖ్యమంత్రి మార్పుపై ఊహాగానాల కొనసాగుతున్నాయి. ఈ నెలాఖరులోగా కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం ఏదో ఒక నిర్ణయం తీసుకునే అవకాశం ఉందనే ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి సిద్ధరామయ్య 'ఎక్స్' వేదికగా ఆసక్తికరమైన పోస్టు చేశారు. ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌తో కలిసి ఉన్న ఫొటోను పంచుకున్నారు. మహిళా శిశు సంక్షేమ శాఖ నిర్వహించిన కార్యక్రమంలో తామిద్దరం పాల్గొన్నట్లు ఆయన తెలిపారు. డీకే శివకుమార్ అంతకుముందు మీడియాతో మాట్లాడుతూ, కొన్ని పెండింగ్ పనుల నిమిత్తం త్వరలో ఢిల్లీకి వెళ్లే అవకాశం ఉందని చెప్పారు. ముఖ్యమంత్రి కూడా వచ్చే అవకాశం ఉందని అన్నారు. కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి నవంబర్ 20 నాటికి రెండున్నరేళ్లు పూర్తయింది. సిద్ధరామయ్య, డీకే శివకుమార్‌లు చెరో రెండున్నరేళ్లు ముఖ్యమంత్రిగా ఉంటారనే ఊహాగానాలు మొదటి నుంచి వినిపిస్తున్నాయి.

# పేదల కోసం అర్ధరాత్రి వరకైనా కోర్టులోనే

**సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ స్పష్టీకరణ**

న్యూఢిల్లీ: పేద కక్షిదారులకు న్యాయం జరిగేలా చూడటం తన తొలి ప్రాధాన్యం అని, అవసరమైతే వారి కోసం అర్ధరాత్రి వరకు న్యాయస్థానంలో కూర్చుంటానని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ అన్నారు. తిలక్ సింగ్ డాంగీ అనే వ్యక్తి కేంద్ర ప్రభుత్వంతో పాటు ఇతరులపై దాఖలు చేసిన పిటిషన్‌ను తోసిపుచ్చిన సందర్భంగా సీజేఐ ఈ విధంగా స్పందించారు. తన కోర్టులో లగ్జరీ వ్యాజ్యాలు ఉండవని, ఇటువంటి కేసులను సంపన్నులు వేస్తారని సీజేఐ అన్నారు. "నేను మీకు ఒక విషయం చెప్పదలుచుకున్నాను. చివరి వరుసలో ఉండే పేదవారి కోసం నేను ఇక్కడ ఉన్నాను. అవసరమైతే వారి కోసం అర్ధరాత్రి వరకు ఇక్కడే కూర్చుంటాను" అని ఆయన వ్యాఖ్యానించారు.

# కోర్సు పేరే చీఫ్ రెవెన్యూ ఆఫీసర్

**తొలిసారిగా ప్రారంభించిన కోల్‌కతా ఐఐఎం**

**సీనియర్ ప్రొఫెషనల్స్ కోసం 10 నెలల కోర్సు**

కోల్‌కతా: దేశంలోని ప్రఖ్యాత విద్యాసంస్థ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ కోల్‌కతా, వ్యాపార రంగంలో ఒక కీలక ముందడుగు వేసింది. రెవెన్యూ, బిజినెస్ విభాగాల్లో తర్వాతి తరం నాయకులను తీర్చిదిద్దే లక్ష్యంతో దేశంలోనే మొట్టమొదటిసారిగా 'చీఫ్ రెవెన్యూ ఆఫీసర్ ' ప్రోగ్రామ్‌ను ప్రారంభించింది. 10 నెలల పాటు సాగే ఈ ఎగ్జిక్యూటివ్ కోర్సు, కంపెనీల వ్యూహరచనకు, క్షేత్రస్థాయి అమలుకు మధ్య వారధిగా నిలుస్తుందని సంస్థ పేర్కొంది. భారతీయ కంపెనీలు ప్రపంచవ్యాప్తంగా విస్తరిస్తున్న ప్రస్తుత తరుణంలో, మార్కెటింగ్, సేల్స్, కస్టమర్ సర్వీస్, ప్రైసింగ్ వంటి కీలక విభాగాల మధ్య సమన్వయం ఎంతో అవసరం. సాధారణంగా ఈ విభాగాలు వేర్వేరుగా పనిచేయడం వల్ల సమన్వయ లోపంతో కంపెనీలు ఆదాయాన్ని కోల్పోతుంటాయి. ఈ సమస్యను అధిగమించి, అన్ని విభాగాలను ఒకే వ్యూహంతో ముందుకు నడిపించే నిపుణులను తయారు చేయడమే ఈ ప్రోగ్రామ్ ముఖ్య ఉద్దేశం. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ పద్ధతిలో ఈ కోర్సును నిర్వహిస్తారు. ఇందులో భాగంగా ఐఐఎం కోల్‌కతా క్యాంపస్‌లో నాలుగు రోజుల పాటు ప్రత్యేక శిక్షణా తరగతులు ఉంటాయి.

# రిలయన్స్‌కు 56 కోట్ల పెనాల్టీ

అహ్మదాబాద్: దేశంలోని దిగ్గజ పారిశ్రామిక సంస్థ రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. అహ్మదాబాద్‌లోని సెంట్రల్ గూడ్స్ అండ్ సర్వీసెస్ ట్యాక్స్ జాయింట్ కమిషనర్, కంపెనీకి రూ.56.44 కోట్ల జరిమానా విధిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ విషయంలో ఈ పెనాల్టీ విధించినట్లు తెలుస్తోంది. అయితే, ఈ ఉత్తర్వులను సవాలు చేస్తూ అప్పీల్‌కు వెళ్లనున్నట్లు రిలయన్స్ స్పష్టం చేసింది. ఈ మేరకు రిలయన్స్ ఇండస్ట్రీస్ స్టాక్ ఎక్స్ఛేంజీలకు సమాచారం అందించింది. ఈ నెల 25న జారీ అయిన ఈ ఉత్తర్వులు, తమకు గురువారం ఉదయం 11:04 గంటలకు ఈ-మెయిల్ ద్వారా అందాయని కంపెనీ తెలిపింది. సెంట్రల్ జీఎస్టీ చట్టం, 2017లోని సెక్షన్ 74 కింద ఈ జరిమానా విధించారు. అయితే, జీఎస్టీ అధికారుల నిర్ణయాన్ని రిలయన్స్ తప్పుబట్టింది. సేవల ప్రదాత (సర్వీస్ ప్రొవైడర్) అందించిన సేవల వర్గీకరణను పరిగణనలోకి తీసుకోకుండానే, ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్‌ను బ్లాక్డ్ క్రెడిట్‌గా పరిగణించి అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారని ఆరోపించింది. అందుకే ఈ ఉత్తర్వులపై అప్పీల్ చేయాలని నిర్ణయించుకున్నట్లు వివరించింది.

వయ్యారి చిత్రం


శ్వేత తివారీ




# అఖండ 2 సునామీ!

## ఈ సారి ఊహించని బిజినెస్

థియేటర్లలోకి రాకముందే అఖండ 2 సునామీ సృష్టిస్తోంది. బిజినెట్ పరంగా కొత్త రికార్డులను రాస్తోంది. రిలీజ్‌కు ముందే ఈ సినిమా సృష్టిస్తున్న రికార్డులు చూసి ట్రేడ్ వర్గాలు సైతం ఆశ్చర్యపోతున్నాయి. ఈ సినిమా ప్రీ రిలీజ్ బిజినెస్ ఏకంగా రూ. 250 కోట్ల మార్క్‌ను టచ్ చేసినట్లు ట్రేడ్ వర్గాల అంచనా. దీన్ని బట్టి డిమాండ్ ఏ రేంజ్ లో ఉందో అర్థం చేసుకోవచ్చు. థియేట్రికల్ హక్కుల రూపంలోనే దాదాపు రూ. 125 కోట్లకు పైగా బిజినెస్ జరిగినట్లు టాక్. నైజాం, సీడెడ్, ఆంధ్రా ప్రాంతాల్లో రైట్స్ కోసం బయ్యర్లు పోటీపడ్డారు. ఇక నాన్ థియేట్రికల్ బిజినెస్ కూడా అదే స్థాయిలో జరిగింది. డిజిటల్, శాటిలైట్ హక్కుల కోసం ప్రముఖ సంస్థలు భారీ ఆఫర్లతో ముందుకు వచ్చాయి. డిజిటల్ రైట్స్ భారీ ధరకే అమ్ముడైనట్లు టాక్. ఇది బాలయ్య కెరీర్ లోనే ఆల్ టైమ్ రికార్డు అని చెబుతున్నారు. ఈ భారీ బిజినెస్ వెనుక ప్రధాన కారణం 'అఖండ' బ్రాండ్ ఇమేజ్. మొదటి భాగం డివోషనల్ టచ్‌తో మాస్ ఆడియన్స్ ను మాత్రమే కాకుండా, ఫ్యామిలీస్ ను కూడా థియేటర్లకు రప్పించింది. ఇప్పుడు సీక్వెల్ లో బాలయ్య మూడు విభిన్నమైన గెటప్స్ లో కనిపిస్తుండటం, విజువల్స్ గ్రాండ్ గా ఉండటం సినిమాపై నమ్మకాన్ని పెంచాయి. డిసెంబర్ 5న 2డీ, 3డీ ఫార్మాట్లలో ప్రపంచవ్యాప్తంగా ఈ సినిమా విడుదల కానుంది. మరి మొదటి రోజు ఓపెనింగ్ లెక్కలు ఏ స్థాయిలో ఉంటాయోనని అభిమానులు సంబురపడుతున్నారు.

### రేట్లు పెంచుతాం.. కానీ రీజనబుల్


ఈ సినిమా నిర్మాతలు రామ్ ఆచంట, గోపి ఆచంట ఒక ఇంటర్వ్యూలో ప్రీమియర్ షోలు, టికెట్ రేట్ల పెంపు గురించి మాట్లాడిన మాటలు ఇప్పుడు ఇండస్ట్రీలో హాట్ టాపిక్ గా మారాయి. సాధారణంగా పెద్ద సినిమా అంటే రేట్ల పెంపు కామన్. ప్రభుత్వ అనుమతితో టికెట్ ధరలు పెంచడం నిర్మాతల హక్కు. దీనిపై నిర్మాతలు మాట్లాడుతూ.. "సినిమా కోసం భారీగా ఖర్చు పెట్టాం, బడ్జెట్ పరంగా ఎక్కడా రాజీ పడలేదు. దానికి తగ్గట్టే మార్కెట్ కూడా బాగుంది. కాబట్టి కచ్చితంగా రేట్ల పెంపు ఉంటుంది. అయితే అది జనాలను ఇబ్బంది పెట్టేలా ఉండదు" అని క్లారిటీ ఇచ్చారు. "రేట్లు పెంచుతాం కానీ, అది రీజనబుల్ గానే ఉంటుంది. ప్రేక్షకులు తిట్టుకునేలా అయితే ఉండదు" అని గోపి ఆచంట స్పష్టం చేశారు.

## డిసెంబర్ 1 నుంచి సావిత్రి మహోత్సవ్



మహానటి సావిత్రి 90వ జయంతి వేడుకలను రవీంద్రభారతిలో డిసెంబర్ 1 నుంచి 6వరకు 'సావిత్రి మహోత్సవ్' పేరిట నిర్వహించబోతున్నామని సావిత్రి కుమార్తె విజయచాముండేశ్వరి తెలియజేశారు. కళాసంస్థ 'సంగమం' ఫౌండేషన్‌తో కలిసి నిర్వహిస్తున్న ఈ ఉత్సవాల్లో సావిత్రి సినిమాల ప్రదర్శన, పాటల పోటీలు ఉంటాయని ఆమె పేర్కొన్నారు. 'డిసెంబర్ 6న జరిగే జయంతి సభలో 'మహానటి' చిత్ర దర్శకనిర్మాతలు నాగ్‌అశ్విన్, ప్రియాంకదత్, స్వప్నాదత్‌లను, 'సావిత్రి క్లాసిక్స్' పుస్తక రచయిత సంజయ్ కిషోర్, ప్రచురణకర్త బొల్లినేని కృష్ణయ్యలను ప్రత్యేకంగా సత్కరిస్తున్నాము. మండలి బుద్ధప్రసాద్‌గారి అధ్యక్షతన జరిగే ఈ సభకు మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడుగారు ముఖ్య అతిథిగా హాజరవుతారు' అని విజయచాముండేశ్వరి తెలిపారు.

## మేజర్ ఉన్నికృష్ణన్ కుటుంబంతో అడివి శేష్



టాలీవుడ్ నటుడు అడివి శేష్ మరోసారి తన మంచి మనసును చాటుకున్నాడు. 26/11 ముంబై దాడుల్లో వీరమరణం పొందిన దేశం గర్వించదగ్గ సైనికుడు మేజర్ సందీప్ ఉన్నికృష్ణన్ కుటుంబాన్ని తాజాగా అడివి శేష్ కలుసుకున్నాడు. ఉన్నికృష్ణన్ జీవిత చరిత్ర ఆధారంగా తెరకెక్కిన బ్లాక్‌బస్టర్ చిత్రం 'మేజర్'. ఈ సినిమాలో ఉన్ని పాత్రలో అడివి శేష్ నటించి మెప్పించాడు. అయితే ఈ సినిమా వచ్చి 3 ఏండ్లు గడవడమే కాకుండా మేజర్ సందీప్ ఉన్నికృష్ణన్ అమరులైన నవంబర్ 26 నాడు, ఆయన తల్లిదండ్రులను కలిసి తన అనుబంధాన్ని చాటుకున్నారు అడివి శేష్. ప్రతి సంవత్సరం నవంబర్ 26న మేజర్ కుటుంబాన్ని కలిసి వారితో గడపడం అడివి శేష్‌కు అలవాటుగా మారింది. ఈ సందర్భంగా, శేష్ ముందుగా ముంబైలోని మేజర్ స్మారక చిహ్నం వద్ద నివాళి అర్పించారు. ఆ తర్వాత ఉన్ని కృష్ణన్ తల్లిదండ్రులు అయిన ధనలక్ష్మి ఉన్నికృష్ణన్, శ్రీ ఉన్నికృష్ణన్‌ను కలిసి క్షేమ సమాచారం తెలుసుకున్నారు. 'మేజర్' సినిమా విడుదలై మూడేళ్లు గడిచినా, ఈ సినిమా బృందానికి, ఉన్నికృష్ణన్ కుటుంబానికి మధ్య ఏర్పడిన అనుబంధం మరింత బలపడుతోంది. మేజర్ గారి తల్లిదండ్రులు చూపే స్ఫూర్తి తనకు ఎంతో గొప్పదని శేష్ తెలిపారు.



## టాలీవుడ్‌వైపు చూడని సాయిపల్లవి

సాయి పల్లవిని కథతో, పాత్రతో మెప్పించడం ఎంత కష్టమన్నది ఓ డైరెక్టర్ రివీల్ చేయడంతోనే బయటకు వచ్చింది. ఓ సినిమా విషయంలో పల్లవిని ఒప్పించడానికి తనకు ఎంత సమయం పట్టిందో, ఎన్ని సిట్టింగులు వేసి ఒప్పించాడో పూస గుచ్చి మరీ చెప్పాడు. ఆమెను ఒప్పించే సరికి తల ప్రాణం తోక వరకూ వస్తుందని ఓపెన్ గానే చెప్పాడు. పల్లవిని కన్విన్స్ చేయడం అన్నది ఏ డైరెక్టర్ కి అయినా పెద్ద సవాలే అన్నాడు. పాత్ర విషయంలో సాయి పల్లవి అంత సెలక్టివ్ గా..ఎనలిటిక్ గా ఉంటుందని అంత వరకూ ఎవరూ ఊహించలేదు. ప్రస్తుతం బాలీవుడ్ లో రామాయణంలో నటిస్తోన్న సంగతి తెలిసిందే. అయితే, ఆమె తెలుగు సినిమాలపై అంతగా శ్రద్ధ చూపించడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. తండేల్ తర్వాత వచ్చిన చాలా అవకాశాలు కూడా వదులుకుందని ప్రచారంలోకి వచ్చింది.

## ఓటీటీలోకి వచ్చేసిన పాంచ్ మినార్




క్రైమ్ కామెడీ థ్రిల్లర్‌గా రూపొందిన పాంచ్ మినార్ సినిమా రిలీజైన వారంలోనే ఓటీటీలోకి వచ్చేసింది. యంగ్ హీరో రాజ్ తరుణ్ లీడ్ రోల్‌లో, రాశీ సింగ్ హీరోయిన్ గా నటించగా.. రామ్ కుడుముల దర్శకత్వం వహించారు. బ్రహ్మాజీ, అజయ్ ఘోష్, సుదర్శన్ తదితరులు కీలక పాత్రలు పోషించగా.. గోవింద రాజు సమర్పణలో మాధవి, ఎం ఎస్ ఎం రెడ్డి రూపొందించారు. నవంబర్ 21వ తేదీన థియేటర్స్ లో విడుదలైన పాంచ్ మినార్ మూవీ.. సడెన్ గా అమెజాన్ ప్రైమ్ వీడియో ఓటీటీలోకి అందుబాటులోకి వచ్చింది. వారం రోజుల్లోనే ఓటీటీలోకి రావడంతో ఆ విషయం సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. దీంతో అంతా డిస్కస్ చేసుకుంటున్నారు. మరీ తక్కువ గ్యాప్ లో ఎందుకు స్ట్రీమింగ్ చేశారోనని మాట్లాడుకుంటున్నారు. నిజానికి ఈ సినిమా డీసెంట్ టాక్ అందుకుంది. క్రిటిక్స్ కు నచ్చడంతో పాజిటివ్ రివ్యూస్ కూడా వచ్చాయి. కానీ సినిమా థియేటర్స్ లో నిలబడలేదు.

## కన్నడవైపు కన్నెత్తి చూడని దీపిక, రష్మిక

దీపిక పదుకోణ్, రష్మిక మందన్నా.. ఇద్దరు కర్ణాటకకు చెందినవారే. ఇద్దరి జర్నీ కన్నడ పరిశ్రమలోనే ప్రారంభమైంది. సరిగ్గా రెండున్నర దశాబ్దాల క్రితం దీపకా పదుకొణె ఐశ్వర్య అనే కన్నడ చిత్రంతోనే తెరంగేట్రం చేసింది. అటుపై ఏడాది గ్యాప్ లోనే బాలీవుడ్ చిత్రం %-%ఓంశాంతి ఓం%-%లో ఛాన్స్ అందుకుంది. షారుక్ ఖాన్ కథానాయకుడిగా నటించిన ఈ చిత్రంలో దీపిక హీరోయిన్ గా నటించగా పర్హాన్ అక్తర్ తెరకెక్కించారు. ఈ విజయం దీపిక జీవితాన్ని రాత్రికి రాత్రే మార్చేసింది. 40 కోట్ల బడ్జెట్ సినిమా 150 కోట్లు వసూళ్లు సాధించడంతో దీపిక కెరీర్ బాలీవుడ్ లో సెట్ అయిపోయింది. ఆ తర్వాత వచ్చిన అవకాశాలతో మంచి విజయాలు అందుకుంది. అయితే, కిరిక్ పార్టీతో కన్నడలో ఎంట్రీ ఇచ్చిన రష్మికా మందన్నా కెరీర్ మాత్రం అందుకు భిన్నం. కన్నడ సినిమాల సక్సెస్ అనంతరం ఛలోతో టాలీవుడ్ లో లాంచ్ అవ్వడం.. ఆ సినిమా సక్సస్ అవ్వడంతో టాలీవుడ్‌లో స్టార్ హీరోయిన్ గా ఎదగడానికి పెద్దగా సమయం పట్టలేదు. అమ్మడి అందం, అభినయం, స్పార్క్ నచ్చడంతో అవకాశాలతో బిజీ అయింది. తెలుగులో స్టార్ హీరోలందరితో పనిచేసి పుష్పతో పాన్ ఇండియాలో ఫేమస్ అయింది. యానిమల్‌తో బాలీవుడ్ లో లాంచ్ అవ్వడం..అది హిట్ అవ్వడం...అక్కడా బిజీ అవ్వడం అన్నీ చాలా వేగంగా జరిగిపోయాయి. కానీ దీపిక, రష్మిక లిద్దరు మళ్లీ కన్నెత్తి సొంత పరిశ్రమ వైపు చూడలేదు.









# ఇక వన్డే పోరు!

## రాంచీ వేదికగా రేపు సౌతాఫ్రికాతో తొలి వన్డే

సౌతాఫ్రికాతో రెండు టెస్టల సిరీస్‌లో క్లీన్ స్వీప్ అయిన టీమిండియా.. వన్డే సిరీస్‌కు సిద్ధమైంది. ఆదివారం రాంచీ వేదికగా జరిగే తొలి మ్యాచ్‌తో ఈ సిరీస్‌కు తెరలేవనుంది. టీమిండియా స్టార్ బ్యాటర్లు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ రీఎంట్రీ ఇవ్వనుండగా.. కెప్టెన్ శుభ్‌మన్ గిల్,వైస్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ గాయాలతో ఈ సిరీస్‌కు దూరమయ్యారు.

**కేఎల్ రాహుల్‌ను కెప్టెన్‌గా ఎంపిక చేశారు. టీ20 ప్రపంచకప్ 2026 నేపథ్యంలో జస్‌ప్రీత్ బుమ్రా, మహమ్మద్ సిరాజ్‌లకు రెస్ట్ ఇచ్చిన టీమిండియా మేనేజ్‌మెంట్.. గాయంతో జట్టుకు దూరమైన హార్దిక్ పాండ్యాను కూడా ఈ సిరీస్‌కు ఎంపిక చేయలేదు.**

దేశవాళీ క్రికెట్‌లో నిలకడగా రాణిస్తున్న రుతురాజ్ గైక్వాడ్ అవకాశం దక్కగా.. తిలక్ వర్మకు కూడా వన్డే జట్టులోకి వచ్చాడు. అక్షర్ పటేల్ స్థానంలో రవీంద్ర జడేజా రీఎంట్రీ ఇచ్చాడు. పేసర్లుగా అర్ష్‌దీప్ సింగ్, హర్షిత్ రాణా ప్రసిధ్ కృష్ణలు ఎంపికవ్వగా.. పేస్ ఆల్‌రౌండర్‌గా నితీష్ కుమార్ రెడ్డికి చోటు దక్కింది. టెస్ట్ సిరీస్ పరాజయం నేపథ్యంలో తుది జట్టు ఎంపిక ఉంటుందనేది ఆసక్తికరంగా మారింది. రుతురాజ్ గైక్వాడ్‌కు అవకాశం దక్కినా అతనికి తుది జట్టులో చోటు దక్కే అవకాశాలు కనిపించడం లేదు. టీమిండియా మాజీ కెప్టెన్ రోహిత్ శర్మతో కలిసి యశస్వి జైస్వాల్ ఓపెనింగ్ చేయనున్నాడు. ఆసీస్ పర్యటనలో గిల్‌తో కలిసి రోహిత్ ఓపెనింగ్ చేశాడు. 38 ఏళ్ల వయసులోనూ రోహిత్ శర్మ అద్భుతమైన బ్యాటింగ్‌తో ఆకట్టుకున్నాడు. గిల్ గైర్హాజరీలో యశస్వి జైస్వాల్‌కు ఇది మంచి అవకాశం. విరాట్ కోహ్లీ మూడో స్థానంలో బరిలోకి దిగనున్నాడు. ఆస్ట్రేలియా పర్యటనలో వరుసగా రెండు మ్యాచ్‌ల్లో డకౌట్ అయిన కోహ్లీ.. మూడో వన్డేలో హాఫ్ సెంచరీతో సత్తా చాటాడు. సొంతగడ్డపై అతను బ్యాట్ ఝుళిపించాల్సిన అవసరం ఉంది. కెప్టెన్ కేఎల్ రాహుల్ నాలుగో స్థానంలో ఆడనుండగా.. ఐదో స్థానంలో రిషభ్ పంత్ ఆడుతాడు. సుదీర్ఘ కాలం తర్వాత రిషభ్ పంత్ వన్డే ఫార్మాట్‌లో అవకాశం అందుకోనున్నాడు. ఒకవేళ ఇద్దరు వికెట్ కీపర్లు ఎందుకని భావిస్తే రిషభ్ పంత్ స్థానంలో తిలక్ వర్మకు అవకాశం దక్కనుంది. స్పిన్ ఆల్‌రౌండర్లుగా వాషింగ్టన్ సుందర్, రవీంద్ర జడేజా, పేస్ ఆల్‌రౌండర్‌గా నితీష్ కుమార్ రెడ్డి బరిలోకి దిగనుండగా.. స్పెషలిస్ట్ స్పిన్నర్‌గా కుల్దీప్ యాదవ్ ఆడనున్నాడు. పేసర్లుగా అర్ష్‌దీప్ సింగ్, హర్షిత్ రాణాకు అవకాశం దక్కనుంది. ప్రసిధ్ కృష్ణ, ధ్రువ్ జురెల్, తిలక్ వర్మ, రుతురాజ్ గైక్వాడ్‌లకు నిరాశే ఎదురవ్వనుంది.



## కోహ్లీకి ధోనీ దావత్!

సౌతాఫ్రికాతో వన్డే సిరీస్ కోసం రాంచీకి వచ్చిన టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ, వికెట్ కీపర్ రిషభ్ పంత్‌కు దిగ్గజ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీ దావత్ ఇచ్చాడు. గురువారం రాత్రి తన ఇంట్లో డిన్నర్ ఏర్పాటు చేశాడు. ఈ దావత్ పూర్తయిన అనంతరం ధోనీనే స్వయంగా తన కారులో విరాట్ కోహ్లీని టీమ్ హోటల్‌కు తీసుకొచ్చాడు. ఇందుకు సంబంధించిన వీడియోలు నెట్టింట వైరల్‌గా మారాయి. ఇక తన కుటుంబంతో లండన్‌లో నివసిస్తున్న విరాట్ కోహ్లీ.. సౌతాఫ్రికాతో మూడు వన్డేల సిరీస్ కోసం బుధవారం భారత్‌కు చేరుకున్న సంగతి తెలిసిందే. ఈ మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా తొలి మ్యాచ్ రాంచీ వేదికగా జరగనుంది. దాంతో జట్టుతో కలిసి కోహ్లీ రాంచీ వచ్చాడు. తమ హోమ్ టౌన్‌కు వచ్చిన కోహ్లీ, పంత్‌కు ధోనీ తన ఇంట్లో డిన్నర్ ఏర్పాటు చేశాడు. ధోనీ నివాసానికి కోహ్లీ వచ్చిన వీడియోలు.. తిరిగి ధోనీ హోటల్ గదిలో దిగబెట్టిన వీడియోలు నెట్టింట వైరల్‌గా మారాయి.

## కోహ్లీ, రోహిత్ ఉన్నా.. ఓడిపోయేవాళ్లం

సౌతాఫ్రికాతో ఓటమి తర్వాత టీమిండియా మేనేజ్‌మెంట్, సెలెక్టర్లపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతుండగా.. దిగ్గజ క్రికెటర్ సునీల్ గవాస్కర్ వారికి మద్దతు తెలిపాడు. ప్రస్తుతం జట్టు సంధి దశలో ఉందని తెలిపారు. దాంతోనే ఆశించిన ఫలితం దక్కలేదని అభిప్రాయపడ్డాడు. విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ జట్టులో ఉంటే ఫలితం మరోలా ఉండేదనే వాదనను తప్పుబట్టారు. కోహ్లీ, రోహిత్ జట్టులో ఉన్నా ఇదే ఫలితం పునరావృతమయ్యేదని నొక్కి చెప్పాడు. కోహ్లీ, రోహిత్, అశ్విన్ ఉండగానే న్యూజిలాండ్ చేతిలో 3-0తో టీమిండియా క్లీన్ స్వీప్ అయిందనే విషయాన్ని గుర్తు చేశారు. ఆస్ట్రేలియా పర్యటనలో కూడా టీమిండియా ఓడిపోయిందని చెప్పారు. 'రిటైర్మెంట్ అనేది వారి వ్యక్తిగత నిర్ణయం. బహుషా.. టీమ్‌మేనేజ్‌మెంట్ వారి భవిష్యత్తు గురించి ఆలోచించాలని చెప్పవచ్చు. కానీ వారు జట్టులో ఉంటే భారత్ గెలిచేది అనే వాదన సరికాదు.

## రో-కో నాకు నిద్రలేని రాత్రులు: మోర్నీ మోర్కెల్

విరాట్, రోహిత్‌తో ఆడిన అనుభవాలను టీమిండియా బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్ గుర్తుచేసుకున్నాడు. 'కోహ్లీ, రోహిత్‌తో కలిసి నేను చాలా మ్యాచ్‌లు ఆడాను. వీరిద్దరికి బౌలింగ్ సవాల్‌గా అనిపించేది. రోకో కారణంగా ఎన్నో నిద్రలేని రాత్రులు చవిచూశాను. కోహ్లీ, హిట్‌మ్యాన్ నాణ్యమైన క్రికెటర్లు. వీరిని కచ్చితంగా వచ్చే వన్డే ప్రపంచ కప్ ఆడించాలి. ఫిట్‌గా ఉండి.. పరుగులు సాధిస్తే వీరిని మెగా టోర్నీకి ఎంపిక చేయవచ్చు. ఎందుకంటే.. ఐసీసీ టోర్నీల్లో అనుభవజ్ఞులైన ఆటగాళ్లు ఉండడం చాలాముఖ్యం. వరల్డ్ కప్ వరకూ 'రో-కో' ఫిట్‌గా ఉంటే స్క్వాడ్‌లో ఉండే అవకాశముంది అని మోర్కెల్ తెలిపాడు. వన్డే సిరీస్‌లో విజయావకాశాలపై స్పందించిన మోర్కెల్ .. ఈ రెండు వారాలు మమ్మల్ని చాలా నిరాశకు గురి చేశాయి. అయితే.. వన్డేల్లో సత్తా చాటుతాం. వన్డే ఫార్మాట్‌లో మా శక్తినంతా ఉపయోగిస్తాం.

## ఉప్పల్‌లో దేశవాళీ టీ20 మ్యాచ్‌లు



ప్రతిష్టాత్మక దేశవాళీ టీ20 టోర్నీ సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో భాగంగా హైదరాబాద్, ఉప్పల్‌లోని రాజీవ్‌గాంధీ ఇంటర్నేషనల్ స్టేడియంలో గ్రూప్-సీ మ్యాచ్‌లు జరగనున్నాయి. ఇప్పటికే నాలుగు మ్యాచ్‌లు పూర్తి కాగా.. మరో 10 మ్యాచ్‌లు జరగాల్సి ఉంది. అయితే ఈ మ్యాచ్‌లు చూసేందుకు ప్రేక్షకులకు హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్‌సీఏ) ఫ్రీ ఎంట్రీ కల్పించింది. ఈ అవకాశాన్ని క్రికెట్ అభిమానులు ఉపయోగించుకోవాలని హెచ్‌సీఏ పేర్కొంది. ఫ్రీగా మ్యాచ్‌లు చూడాలనుకునేవారు గేట్ నెంబర్ 3 నుంచి స్టేడియంలోకి ఉచితంగా వెళ్లవచ్చు. నవంబర్ 26న ఈ టోర్నీ ప్రారంభం కాగా.. ఉప్పల్ స్టేడియం వేదికగా నాలుగు మ్యాచ్‌లు పూర్తయ్యాయి. ఈ టోర్నీలో దేశవాళీతో పాటు వెటరన్ స్టార్ క్రికెటర్లు బరిలోకి దిగుతున్నారు. బరోడా తరఫున హార్దిక్ పాండ్యా బరిలోకి దిగే ఛాన్స్ ఉంది. అతన్ని చూసే అవకాశం ప్రేక్షకులకు దక్కుతుంది. ఉప్పల్‌లో నవంబర్ 30, డిసెంబర్ 2, డిసెంబర్ 4, డిసెంబర్ 6, డిసెంబర్ 8 తేదీల్లో రెండేసి మ్యాచ్‌లు జరగనున్నాయి. తొలి మ్యాచ్ ఉదయం 11 గంటలకు ప్రారంభం కానుండగా.. రెండో మ్యాచ్ సాయంత్ర 4.30కు మొదలవ్వనుంది.



## గంభీర్.. నా చుట్టం కాదు

సౌతాఫ్రికా చేతిలో టీమిండియా ఘోర పరాజయానికి హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ ఒక్కడినే బాధ్యుడిని చేయడం సరికాదని మాజీ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ అన్నాడు. ఆటలో గెలుపోటములు సహజమని, ఈ ఘోర పరాజయానికి ఆటగాళ్లు కూడా బాధ్యులేనని అభిప్రాయపడ్డాడు. సౌతాఫ్రికాతో రెండు టెస్టల సిరీస్‌లో టీమిండియా 0-2తో క్లీన్ స్వీప్ కావడంతో గంభీర్‌ను హెడ్ కోచ్ పదవి బాధ్యతల నుంచి తప్పించాలని ఫ్యాన్స్ డిమాండ్ చేస్తున్నారు. తాజాగా ఈ వ్యవహారంపై తన యూట్యూబ్ ఛానెల్ వేదికగా స్పందించిన అశ్విన్.. గంభీర్‌కు అండగా నిలిచాడు. 'క్రికెట్ అనేది ఒక ఆట. గెలుపోటములు సహజం. జట్టును నడిపించడం అంత సులువు కాదు. ఈ ఘోర పరాజయానికి గంభీర్ కూడా బాధపడుతున్నాడు. మనం ఈ విషయాన్ని అర్థం చేసుకోవాలి. ఈ ఓటమికి గంభీర్ ఒక్కరినే బాధ్యుడిని చేయడం సరికాదు. జట్టులో ప్రతీ ఒక్కరు ఈ ఓటమికి బాధ్యులే. భారత క్రికెట్ ఆర్థికంగా చాలా బలమైనది. అందుకే జట్టు ఓటమిపై తీవ్ర చర్చ జరుగుతుంది. హెడ్ కోచ్ బ్యాట్ పట్టుకొని మైదానంలోకి దిగి ఆడలేదు కదా? ఆటగాళ్లు కూడా బాధ్యతాయుతంగా ఉండాలి. ఓటమికి ఒక్కరినే నిందించడం సరికాదు. కోచ్, కెప్టెన్ టీమ్ కాంబినేషన్‌పై నిర్ణయాలు తీసుకుంటారు. కానీ మన జట్టులోని ఆటగాళ్లలో ఒక్కరు కూడా బాధ్యతాయుతంగా ఆడినట్లు కనిపించడం లేదు. పిండి కొద్ది రొట్టె అంటారు. అసలు పిండే లేకుంటే రొట్టెలు ఎలా చేస్తారు? గంభీర్‌ను వెనకేసుకురావడానికి అతను ఏం నా చుట్టం కాదు. తప్పుడు జరగడం సహజం.

RAJASTHAN ROYALS | ROYAL CHALLENGERS BANGALORE

## అమ్మకానికి ఆర్సీబీ, ఆర్ఆర్

**హర్ష్ గోయెంకా సంచలన ట్వీట్**

ఐపీఎల్ 2026 సీజన్ నేపథ్యంలో ప్రముఖ పారిశ్రామిక వేత్త హర్ష్ గోయెంకా సంచలన ట్వీట్ చేశారు. రెండు ఐపీఎల్ జట్లు అమ్మకానికి ఉన్నాయని తెలిపారు. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ)తో పాటు రాజస్థాన్ రాయల్స్ కూడా అమ్మకానికి సిద్ధంగా ఉందని చెప్పారు. ఈ రెండు ఫ్రాంచైజీలను కొనుగోలు చేసేందుకు ఐదుగురు బయ్యర్స్ రేసులో ఉన్నారని, పుణే, అహ్మదాబాద్, ముంబై, బెంగళూరు, అమెరికాలో ఎవరికి ఈ జట్లు దక్కుతాయో అని ఎక్స్ వేదికగా వెల్లడించారు. ఇప్పటికే ఐపీఎల్ 2025 ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ) అమ్మకానికి సిద్ధంగా ఉన్నట్లు వార్తలు వచ్చాయి. ఆర్‌సీబీని హోంబాలే ఫిల్మ్స్ ప్రొడక్షన్ హౌస్ కొనుగోలు చేస్తుందని, డీల్ కూడా పూర్తయిందని వార్తలు వచ్చాయి. కానీ ఈ వ్యవహారంపై ఆర్‌సీబీ ఫ్రాంచైజీ ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. ఒకవైపు ఆర్‌సీబీ ఫర్ సేల్ వ్యవహారం నెట్టింట చర్చనీయాంశమవుతుండగానే హర్షా గోయెంకా రాజస్థాన్ రాయల్స్ సేల్ విషయాన్ని బయటపెట్టారు. ' ఐపీఎల్ జట్లలో ఒకటి కాదు.. రెండు జట్లు అమ్మకానికి సిద్ధంగా ఉన్నట్లు నేను విన్నాను. ఆర్‌సీబీతో పాటు రాజస్థాన్ రాయల్స్ అమ్మకానికి వచ్చినట్లు తెలుస్తోంది. ఫ్రాంచైజీల పాపులారిటీని సొమ్ము చేసుకునేందుకు ఈ రెండు ఫ్రాంచైజీలు సిద్ధంగా ఉన్నట్లు అర్థమవుతుంది. ఈ రెండు జట్లను కొనుగోలు చేసేందుకు నలుగురు లేదా ఐదుగురు బయ్యర్స్ సిద్ధంగా ఉన్నారు. ఈ రెండు జట్లను ఎవరు కొనుగోలు చేస్తారో? పుణె, అహ్మదాబాద్, ముంబై, బెంగళూరు, అమెరికాకు చెందిన వ్యక్తులే కొనుగోలు చేస్తారా? 'అని హర్షా గోయెంకా ట్వీట్ చేశారు.

ఈవార్తలు
# ప్రజావాణి
సంపాదకీయం
నేటి ఈవార్తలు
శనివారం 29-11-2025 | www.evarthalu.com



2009, నవంబర్ 29వ తేదీ.. పేరున్న ఓ పేపర్ల జర్నలిస్టుగా పన్జేస్తున్న రోజులు. రోజు రాత్రి పదకొండయ్యేది ఇంటికి వొయ్యేసరికి. మా ఇంటికాడనే బుక్కెడంత బువ్వ దినివొయి పెద్దమ్మొళ్లింటికాడ పండుకునుడు నాకలవాటు.

పెద్దమ్మొళ్ల ఇంటికాన్నే పండుకునుడెందుకంటే? మా ఇల్లు ఇరుకుటం ఉండటం ఒక్క కారణమైతే, పెద్దమ్మొళ్ల ఇల్లు లంకంత ఉండటం, ఆ లంకంత కొంపల ఇద్దరే ఇద్దరు పెద్ద మనుషులుండటం ఇంకో కారణం.

పెద్దమ్మొళ్ల ఇల్లు మా ఇంటి కాన్నుంచి కొంచెం దూరం ఉంటది. ఒంటరిల్లు, ఎదురంగనే శ్మశానం. రాత్రిపూట పెద్దమ్మ, పెద్దబాపుకేమన్నయితెట్ల? అని నాడే ఆలోచన జేసి, ఏ నాత్రయినా వాళ్లింటికి వొయ్యి పండుకునేది. నేను వొయ్యేదాన్క వాళ్లగూడ నిద్రవోకపొయ్యేది. నా నడక సప్పుడిని నేన్ వొయ్యేసరికి తలుపు దీస్తుండె పెద్దబాపు.

# నాటి 'దీక్షా దివస్'.. ఓ యాది!



ఇంతకూ పెద్దబాపు పేరు శెప్పలేదు గదా? గడ్డం మల్లయ్య, సన్నాఫ్: పెద్ద వెంకయ్య (మా తాత). మా తాతకు ఎనమండుగురు కొడులైతే.. అందరికన్న పెద్ద ఈ మల్లయ్య పెద్దబాపే. నేనే నాత్రి వొయ్నా... ఆ అద్దుమనాత్రి గూడ 'తిన్నావురా...' అనడిగేది. పుసుక్కున తినలేదంటే పాపమే.. 'పోరనికి ఇంత అన్నం వెట్టుపొమ్మని' నిద్రవొయ్న పెద్దమ్మను లేపేది. ఆయ్నకు నేనంటే అంతగనమిట్టం. ఎంతైనా ఒక్కరక్తం గదా? ఆ నిద్రమబ్బుల గూడ నేన్ తినేదాన్క ఆయనకు దోసిన ముచ్చట జెప్పేది. సిన్నప్పుడు ఎంత కట్టవడ్డడో, తిండికి ఎంత తిప్పలవడ్డడో దినాం జెప్పేది. నేన్ తప్పుదొవ్వ వట్టద్దు, మంచి ఉజ్జోగం జేసోకవాల్నని ఆయన తపన. నాగ్గూడ ఆయ్న ముచ్చటంటే పానం. ఓ రోజు గిట్లనే ఆఫీసులకెల్లి వొయ్యేసరికి లేటయింది. పోవుడే లేటంటే అద్దరాత్రిల టీవీ సూసుడలవాటుండేదప్పట్ల. టీవీ జూసి, జూసి అటే నిద్రవొయ్యేది. టీవీ అట్లనే మొత్తుకునేది తెల్లారేదాన్క. తెల్లారి పెద్దమ్మతోనో బాగోతం. 'టీవీ బంజేయకుంట వంటె కరెంటు బిల్లు మీ అయ్య గడ్తాడ్ర' అని కారడ్డమాడేది. 'ఆ.. వాని దగ్గర కుచ్చులూగులాడుతున్నయి, వాడొచ్చి కడ్తడాగు' అని ముసి ముసి నవ్వేది. నవ్వేది నవ్వుకుంటనే దగ్గేది. పెద్దబాపు బాగ నవ్వితే సాలు ఆటోమ్యాటిక్‌గా దగ్గొచ్చేది. (ఆ దగ్గు గంభీరంగుంటుండె) రోజట్లెక్క పెద్దమ్మ తిట్ల పురాణంతోని లేపుతున్నదనుకొని తిరంగ మెల్లగ లేస్తున్నా. 'ఓ పోడా.. పెద్దబాపు అంతెటో జేత్తండురా.. కాల్లెక్కలు అంకర వోతున్నయి, మూతి ముడుసుకపోతున్నదిరా' అని ఏడ్సుకుంటా చెప్పింది పెద్దమ్మ.

వరండాల పండుకున్న నేను జెప్పన వొయి వంకరవోతున్న పెద్దబాపు చెయ్యినందుకున్న. అరిచేతులు రాసుకుంటా.. 'పెద్దబాపు ఏమైందే? ఓ పెద్దబాపు ఏమైందే?' అంటే.. 'ఏం గాలేదురా, శెయ్యిలన్ని తిమ్మిరి వట్టినట్టయితున్నయిరా' అంటండు గని మాట నత్తివోతున్నది. ఏదో జరుగుతున్నదని నాకర్థమైతున్నది. ఇగ లాభం లేదు. ఆల్శ్యం శెయ్యొద్దని మెల్లగ 'బండి మీద కూసుంటవానే పెద్దబాపు' అనడిగిన. 'ఆ కూసుంటరా' అన్నడు. బండి చాల్జేసిన. బండెన్క ఆయ్నను కూసోవెట్టుకొని కన్నారం దావఖానకు బైలెల్లిన. ఆ రోజు ఐతారం. 2009, నవంబర్ 29. తెలంగాణ రాష్ట్రాన్ని తీస్కచ్చేటందుకు 'దీక్షాదివస్'కు బయల్దేరిండు నాటి ఉద్యమ రథసారథి కేసీఆర్. అల్గునూరు కాడ అరెస్టయిండని తెలిసింది. అక్కణ్నుంచి మెల్లగా మూణ్నాలుగు కిలోమీటర్ల దాకా ట్రాఫిక్ జామైంది. ఎదురంగ అచ్చేటాయ్న బండినా 'మా బండివోతదానే అన్న' అనడిగిన. 'ఏహే ఏడవోతదే పోద్, పోద్. నేనే ఎన్కకొచ్చిన. దబ్బన పోయేవ్ మజ్జల్నే ఇరుక్కపోతవ్' అన్నడు.

బండి సదాశివపల్లి కాన్నే వాగ్గడ్డకు మల్పిన. ఎదురంగ అచ్చేటాయ్నె.. 'ఎహ్హా ఈనంగల బండి ఏడెల్తదే' అని భయపెట్టవట్టిండు. ఎటైతటాయె, ఇయ్యాళ్ల పెద్దబాపును వాగు దాటిచ్చినోన్నే గావాలె అని బండి ఎక్స్‌లేటర్‌ను గట్టిగ్గుంజిన. 'ఓ పిల్లగా ఎన్క కూసున్నాయ్నొయి శెప్పులూసిపోతున్నయి' అని పక్కపొంటి వొయ్యే బండి మీదాయ్నె మొత్తుకుంటనే ఉన్నడు. బండాపి జూసిన. ఆయ్న శెప్పినట్టే పెద్దబాపు ఒక కాలికి శెప్పు లేదు. ఇంకో కాలుకు జర్రయితే శెప్పూసిపొయ్యేది. 'పెద్దబాపు శెప్పు వోయింది గూడ తెలుస్తలేదానె' అనడిగితే 'ఏమోరా, నేను శెప్పున్నదనుకుంటున్నరా' అన్నడు. నీ శెప్పుకినా వారెత్తు పీక్తే పీకనియి అని రెండు శెయ్యిలతోని నా బొత్తను వట్టుకొమ్మన్న. మెల్లగా వొయ్యేసరికి వాగు రానే అచ్చె. వాగుల నీళ్లు నడుంబడా వారుతున్నయి. ఇప్పుడా వాగు మీన్నుంచే కేబుల్ బ్రిడ్జి వడ్డది. వాగిటు కొస్సకు బండాపిన. ఎట్ల దాటుదామా అని ప్లాన్జేస్తున్న.

మా సీదరన్న (గడ్డం మల్లయ్య పెద్దకొడుకు)కు అప్పటికే ముచ్చట ఎర్కైంది. వాగటొడ్డుకు ఆయనచ్చి నిలవడ్డడు. వాగు ఇటొడ్డుకు నేను. అక్కన్నే బండివారేసి అన్న, నేను ఇద్దరం గల్సి పెద్దబాపును అమాంతం లావట్టుకొని వాగు దాటిచ్చినం. అటుదిక్కున్న బండి మజ్జన పెద్దబాపును కూసోవెట్టినం. ఆ రోజు ఐతారం. శనారం అచ్చిందంటే సాలు పట్నం బోవుడు, ఎంజాయ్ చేసుడు, సోమారం ఏం ఎరుకలేనట్టు మళ్లచ్చి దవాఖాన్ల కూసునుడు మా కన్నారం డాక్టర్లకలవాటు. కన్నారంల ఉన్న దవాఖాన్లన్ని తిరిగినం బండి మీద. ఒక్క దవాఖాన్ల గూడ ఒక్క డాక్టర్ లేడు. ఆఖరికి కన్నారంల కొత్తగా వడ్డ ఓ పైవేటు దవాఖాన్లకు తోల్కపోయినం. పోవుడుతోనే శంకర్‌దాదా ఎంబీబీఎస్ సినిమాల లెక్కనే ఆ వైర్లు, ఈ వైర్లు బట్టలిప్పి తొడిగేసరికి పానం ఎల్కపోయింది. ఏమన్నయితదా ఏందనే అనుమానమొచ్చింది. ఫెరాల్సిస్ సిన్నగచ్చింది వాస్తవమే అయినా అక్కడి డాక్టర్లు జేసిన యాక్టింగ్ మాత్రం కోట్ల బడ్జెట్‌తో తీసే రాజమొగిలి సినిమా లెవెల్లో ఉన్నది. రోగికి నచ్చిన డాక్టర్ దగ్గరికి వోతే రోగం జల్ది తగ్గుతదనే సామెత నిజమే. నాతోని పెద్దబాపు 'నేన్సచ్చిన మంచిదే గనీ సతీష్‌గా నేను ఇన్లుండరా' అన్నడు. లక్ష్మీనారాయణ డాక్టరంటే పెద్దబాపుకు నమ్మకం. బల్మీట్టికి రెండ్రోజులు ఆ దవాఖాన్ల ఉంచి సోమారం నాడు లచ్మినారాయణ దవాఖానకు అంబులెన్స్‌ల తోల్కపోయినం. పెద్దబాపు పక్కపొంటి నేనే గూసున్న. ఓ దిక్కు ఇంకా



మాటంకరవోతున్నది.. మజ్జన విల్సి 'అరేయ్ సతీషు... కేసీఆర్‌ను అరెస్టు జేసిన్రట గదరా? దవాఖాన్ల అందరనుకుంటాంటె ఇనవడ్డదిరా ఈ ఆంధ్రా పాలకులు తెలంగాణియ్యనియ్యర్రా...' అని బాధవడవట్టిండు. సల్లగున్న నా పెయ్యి ఒక్కసారి వేడెక్కింది. పడుకున్న రోమాళ్లు ఒక్కసారి నిక్కవొడ్శినయి.

***

'అరేయ్ నేను 1942ల వుట్టిన, 1965ల సర్వేయర్‌గా రెవెన్యూ డిపార్టుమెంట్‌ల నౌకరొచ్చింది. నౌకరొచ్చినంక రెండేండ్లకు మీ పెద్దమ్మను పెండ్లి జేస్కున్న. పెండ్లయ్యిన కొత్తల్నే కర్నూలుకు ట్రాన్స్‌ఫర్ కొట్టిర్రా ఇక్కడి పెద్దసార్లు. ఛల్ నేన్ ఆ ఆంధ్రకు వోనంటే వోనన్నా.. వోకుంటే నౌకరికి రాజీనామా ఇయ్యిమన్నరు. కట్టపడి సంపాయించిన నౌకరి గద బిడ్డా ఇడువబుద్ధి గాలె. అవ్వా, నాయిన, ఏడుగురన్నదమ్ములు, ఒక సెల్లెనిడిసివెట్టి, పెద్దమ్మ నేను కర్నూల్ల కాలువెట్టినం. అక్కడ తెలంగానోణ్ని సిన్నసూపు జూసేటోళ్లు. ఛల్ గీ ఆంధ్రోనితోని మనకు పొత్తేందని 1969ల మా తెలంగాణ మాగ్గావాలెనని తెలంగాణ ఉద్యమం షురూవైందిరా.. ఆ ఉద్యమంల నేన్గూడ రాళ్లెత్తిన. పోలీసోళ్లతోని దెబ్బల్ దిన్న. అప్పుడు ఉద్యమం రెండేండ్ల దాకా నడ్సింది. ఇగ తెలంగాణొస్తదనుకునే మోపున అణగదొక్కిర్రు బిడ్డా. మన తెలంగాణ నాయకులే ఆంధ్రోని మోజేతు నీళ్లు తాగిర్రు' అని రోజు నాత్రిళ్ల పెద్దబాపు శెప్పే తెలంగాణ ముచ్చట్లు గుర్తుకొచ్చినయి.

***

ఆ అంబులెన్సుల గూడ తెలంగాణ ముచ్చటదీసి 'నాడే అస్తదనుకున్న తెలంగాణ ఇంకా రాకపాయె. ఇప్పుడు కేసీఆర్ కొట్లాడితే గూడ అరెస్టులు జేయవట్టిరి' అని మస్తు బాధవడ్డడు. లచ్మినారాయణ దవాఖానల ఏడ్రోజులున్న పెద్దబాపు కరెస్టు 2009, డిసెంబర్ 9న మంచిగై డిశ్చార్జయిండు. ఇంటికి వొయ్యేసరికి నాత్రి పదైంది. అప్పటికి తెలంగాణ మొత్తం లొల్లి లొల్లి నడుస్తున్నది. యువకులు తెలంగాణ కోసం సచ్చిపోతున్నరు. కేసీఆర్ దీక్ష మీదనే ఉన్నడు. నిమ్మరసం తాగుమని ఎంత బతిమిలాడినా సుక్క మింగుతలేడు. ఇగ కాంగ్రెస్‌కు తెలంగాణ ఇచ్చుడే తప్ప వేరే దారి లేదు. డిశ్చార్జి అయి ఇంటికి వోయినంక గూడ పెద్దబాపు 'అరేయ్ సతీషు టీవీ వెట్టురా తెలంగాణ ముచ్చటేమైందో తెలుస్తద'న్నడు. కరెస్టు నాత్రి 11 పదకొండు దాటింది. పదకొండుంబావుకల్లా ఎర్రశాల్వ గప్పుకొని ప్రెస్‌మీట్ వెట్టిండు సిదంబరం సార్. 'తెలంగాణ ఇచ్చేటందుకు మేం సిద్ధమైనం. మీరు దీక్ష విరమించాలె కేసీఆర్ గారు' అని ఇట్ల ప్రకటన జేసిండో లేదో.. అటు పెద్దబాపు సంబురానికి, ఇటు నా సంబురానికి పట్టపగ్గాల్లెవ్వు. ఇద్దరం గల్సి స్వీట్లు వంచుకున్నం. పాపం పెద్దబాపు సంతోషం ఒక్కరోజు గూడ ఉండలె. తెల్లారి ఆంధ్రోళ్లందరూ రాజీనామా జేసేసరికి అచ్చిన తెలంగాణ ఎన్కకువోయింది. పెద్దబాపుకే కాదు, తెలంగాణోళ్లందరికి నోటికాడి బుక్క జారినంత పనైంది. అయినగూడ 'ఇగ తెలంగాణను ఆపుడు ఎవ్వనితరం గాదురా.., ఏదో రోజు కేసీఆర్ తెలంగాణ తెస్తడని నాతో నమ్మకంగన్నడు పెద్దబాపు. ఆయన నమ్మకం నిజమైంది. పెద్దబాపు గన్న ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కల నెరవేరింది. 2014 జూన్ 2న తెలంగాణొచ్చింది. జై తెలంగాణ.

**'తెలంగాణ దీక్షాదివస్'కు పదహారేండ్లు..**



గడ్డం సతీష్
9959059041

రచయితలకు ఆహ్వానం!

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

OWNED, PUBLISHED BY **BOMMAKANTI SHRAVAN KUMAR**, PRINTED BY SUNDAY PRINTING PRESS, #3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR - 522006, ANDHRA PRADESH. PUBLISHED AT #4-36, BALWANTHAPOOR, MALLIAL MANDAL, JAGITIAL DISTRICT - 505452, TELANGANA, EMAIL ID: contact@evarthalu.com, PHONE NUMBER: 9440455811, EDITOR: **BOMMAKANTI SHRAVAN KUMAR**, RNI REGD NO.: TGTEL/25/A1385. CORPORATE OFFICE: #1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI DISTRICT - 500010, TELANGANA. Landline: 040-35673004.